
10న పార్వతీపురంలో జాబ్‌మేళా

పార్వతీపురం టౌన్, జూలై 5 : పార్వతీపురం పట్టణ పరిధి కొత్తవలసలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 10న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సీహెచ్ చలపతిరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐసీఐసీఐ బ్యాంకు, డెక్కన్ కెమికల్స్, యాక్సెస్ బ్యాంకు, ఫాక్స్‌పాన్, ఆల్‌స్టామ్, డైకి అల్యూమినియం ఇండస్ట్రీ ఇండియా తదితర కంపెనీల్లో ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. టెన్త్, ఐటీఐ, డిప్లమో, ఏదైనా డిగ్రీ, బీటెక్ ఉత్తీర్ణులైన, 35 ఏళ్ల లోపు వారు అర్హులని తెలిపారు. పూర్తి వివరాల కోసం ఈ 95151 89844 నంబరుకు ఫోన్ చేయాలని సూచించారు.

ఎవరెక్కడో?

- అధికారులకు బదిలీల గుబులు.. అనుకూల స్థానాల కోసం పైరవీలు
- ఇతర జిల్లాల నుంచి మన్యం వచ్చేందుకు యత్నాలు
- ఎక్కడ పోస్టింగ్ ఇస్తారోనని ఇక్కడున్న వారిలో ఆందోళన
- వైసీపీ సర్కారుతో అంటకాగిన వారు జిల్లాకు వద్దంటున్న కూటమి శ్రేణులు





(పార్వతీపురం- ఆంధ్రజ్యోతి)

టీడీపీ కూటమి ప్రభుత్వం పాలనా పగ్గాలు చేపట్టిన తర్వాత వరుసగా అధికారుల బదిలీలు కొనసాగుతున్నాయి. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా పలువురు కలెక్టర్లు, ఎస్పీలు, వివిధ శాఖల అధికారులకు స్థానచలనం కల్పించారు. వారిలో కొందరికి పోస్టింగులు ఇవ్వని సంగతి తెలిసిందే. అయితే గత వైసీపీ ప్రభుత్వంతో అంటకాగి.. నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరించిన జిల్లా అధికారులకు ఇప్పుడు బదిలీల గుబులు పట్టుకుంది. తమను ఎక్కడకి బదిలీ చేస్తారోనని ఆందోళన చెందుతున్నారు. ఇదిలా ఉండగా.. ఎన్నికల విధుల్లో భాగంగా పొరుగు జిల్లాలకు వెళ్లిన వారు సైతం తిరిగి 'మన్యం'లో తమ అనుకూల స్థానాలకు వచ్చేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో ఇప్పటికే కొందరు తమకున్న పరిచయాలతో పైరవీలు సాగిస్తున్నారు. టీడీపీ కూటమి ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. మరికొందరు కులం కార్డును ఉపయోగిస్తున్నారు.

సొంత జిల్లాలకు వెళ్లేందుకు..

పార్వతీపురం మన్యం జిల్లా ఏర్పడిన తర్వాత వివిధ శాఖలకు చెందిన కొంతమంది అధికారులు ఇతర జిల్లాల నుంచి పదోన్నతులపై ఇక్కడకు వచ్చారు. మరికొంతమంది సాధారణ బదిలీలపై వచ్చారు. వీరంతా తమ జిల్లాలకు దగ్గర్లో లేదా సొంత జిల్లాలకు వెళ్లేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే ఈ ప్రయత్నాలు సఫలీకృతం అవుతాయా.. లేదా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది. దీంతో వివిధ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు టెన్షన్ పడుతున్నారు. తమకు కావాల్సిన స్థానం దొరుకుతుందా.. లేదా? అని మథనపడుతున్నారు. జిల్లాలో ఒక కీలక శాఖకు చెందిన అధికారి ఇతర జిల్లా నుంచి బదిలీపై వచ్చి ఇక్కడ పని చేస్తున్నారు. తన సొంత జిల్లాకే ట్రాన్స్‌ఫర్ అవుతుందని నమ్మకంతో ఉన్నారు. అయితే ఒకవేళ బదిలీ కాకపోతే తన పరిస్థితేమిటో అర్థం కావడం లేదని తన సహోద్యుగుల దగ్గర వాపోయారు. మరో శాఖకు చెందిన అధికారి విజయనగరం జిల్లాతో పాటు పార్వతీపురం మన్యం జిల్లాలో ఉన్నతాధికారిగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం బదిలీల్లో తిరిగి ఆయన్ని పార్వతీపురం వేస్తారా లేక విజయనగరంలో కొనసాగిస్తారా.. లేకుంటే ఇతర జిల్లాలకు పంపిస్తారో తెలియని పరిస్థితి నెలకొంది.

కొంతమంది తహసీల్దార్లు ఇలా..

జిల్లాలోని 15 మండలాలకు చెందిన తహసీల్దార్లు సార్వత్రిక ఎన్నికలకు ముందు ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్లారు. అయితే మరికొన్నిరోజుల్లో వారు సొంత జిల్లాకు రానున్నారు. కలెక్టర్ కార్యాలయంలో ఆయా తహసీల్దార్లు రిపోర్టు చేసిన తర్వాత... వారికి కేటాయించిన మండలాలకు వెళ్లాల్సి ఉంది. దీంతో ఇతర జిల్లాల్లో ఉన్న తహసీల్దార్లు అక్కడ ఉంటుండగానే జిల్లాలో పనిచేసేందుకు, తమ అనుకూలమైన స్థానం కోసం పైరవీలు ప్రారంభించారు. దీంతో ఏ తహసీల్దార్ ఎక్కడికి వెళ్తారో తెలియని పరిస్థితి నెలకొంది.

వైసీపీ కార్యకర్తల్లా..

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అనేమంది తహసీల్దార్లు ఆ పార్టీ కార్యకర్తల్లా వ్యవహరించారు. మండల మేజిస్ట్రేట్ స్థాయి ఉన్న కొంతమంది వైసీపీకి అనుకూలంగానే పనిచేశారు. ఎన్నికల విధుల్లో భాగంగా వారు ఇతర జిల్లాలకు వెళ్లినా.. ఏ మాత్రం మారలేదు. గతంలో టీడీపీ కార్యకర్తలు, నాయకులు కార్యాలయంలోకి వచ్చినా పట్టించుకోని పరిస్థితి.. మరికొంతమంది తహసీల్దార్లు గత ఐదేళ్లలో వైసీపీ ఎమ్మెల్యేలు చెప్పిన విధంగా నడుచుకునేవారు. వైసీపీ కార్యకర్తలు, నాయకులు చెప్పిందే చేసేవారు. నిబంధనలను ఏ మాత్రం పట్టించుకునే వారు కాదు. అయితే ఇటువంటి తహసీల్దార్లు తిరిగి వారికి అనుకూలమైన స్థానాల్లోకి వచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ మేరకు టీడీపీ కూటమి ఎమ్మెల్యేల చుట్టూ తిరుగుతున్నట్టు సమాచారం. కొంతమంది తహసీల్దార్లు కులాన్ని అడ్డం పెట్టుకొని.. వారి సంఘ పెద్దలతో చెప్పిస్తున్నట్లు తెలిసింది. ఇంకొందరు ఇతర జిల్లాలోని కొంతమంది ఎమ్మెల్యేలపై ఒత్తిడి తీసుకొని వచ్చి.. వారికి కావాల్సిన స్థానాల కోసం పైరవీలు చేస్తున్నారు.

వారిని దూరంగా ఉంచాలి..

వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు కనీసం టీడీపీ కార్యకర్తలు, నాయకులను గౌరవించకుండా ఆ పార్టీ నేతలు చెప్పిందే చట్టంగా పనిచేసిన కొంతమంది తహసీల్దార్లను దూరంగా ఉంచాలని నాలుగు నియోజకవర్గాలకు చెందిన తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఎమ్మెల్యేలను కోరుతున్నారు. వైసీపీ మూలాలున్న తహసీల్దార్‌కు జిల్లాలో పోస్టింగ్‌లు ఇస్తే.. వారు మళ్లీ వైసీపీ నేతలతో జత కలిసి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే పరిస్థితి ఉందని ద్వితీయ శ్రేణి నాయకులు స్పష్టం చేస్తున్నారు. నిబంధనలు ప్రకారం పనిచేసే వారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వాలని, మిగిలిన వారికి కలెక్టరేట్ లేదా సబ్ కలెక్టర్ కార్యాలయాల్లో పోస్టింగ్‌లు ఇవ్వాలని కొంతమంది టీడీపీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

కొంతమంది ఎంపీడీవోలు ఇలా..

గత ఐదేళ్లలో జిల్లాలో కొందరు ఎంపీడీవోలు వైసీపీతో అంటకాగారు. కొంతమంది వైసీపీ నాయకులకు అనుకూలంగా పనిచేశారు. టీడీపీ కార్యకర్తలు, నాయకులను కనీసం పట్టించుకోలేదు. కొన్ని మండలాల్లో వారి న్యాయమైన సమస్యలను కూడా పరిష్కరించలేదు. ఇదిలా ఉండగా గతంలో అవినీతి, అక్రమాలకు పాల్పడి ప్రస్తుతం ఇతర జిల్లాల్లో పనిచేస్తున్న కొందరు అధికారులు తిరిగి పార్వతీపురం మన్యం జిల్లాలో పోస్టింగ్‌ల కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. అయితే ఇటువంటి ఎంపీడీవోలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని, తమ మండలాలకు వారు వద్దని కొంతమంది టీడీపీ కూటమి నాయకులు బహిరంగంగానే ఎమ్మెల్యేలకు చెబుతున్నారు.

సిగ్నల్స్ ఉండవు.. ఫోన్లు పనిచేయవు..

- ఇదీ ఏజెన్సీలో పరిస్థితి..
- పూర్తవ్వని సెల్‌టవర్ల నిర్మాణం
- వాటిపై దృష్టి సారించని గత వైసీపీ సర్కారు
- నెట్‌వర్క్ సౌకర్యానికి దూరంగా గిరిజన గ్రామాలు
- పింఛన్లు, రేషన్ సరుకుల పంపిణీకి ఇబ్బందులు
- గిరిజనులకు తప్పని అవస్థలు
- నూతన ప్రభుత్వంపై ఆశలు

సీతంపేట: జిల్లాలో మారుమూల గిరిజన ప్రాంతాలకు నెట్‌వర్క్ సౌకర్యం ఉండడం లేదు. దీంతో సెల్ ఫోన్లు సరిగ్గా పనిచేయడం లేదు. సిగ్నల్స్ కోసం గిరిజనులు కొండలు.. గుట్టలు ఎక్కి దిగాల్సి వస్తోంది. కిలోమీటర్ల మేర నడిచి.. సిగ్నల్స్ ఉన్న చోటకు చేరుకోవాల్సి వస్తోంది. పింఛన్లు, రేషన్ సరుకులు అందుకునే సమయంలోనే కాదు.. ఆధార్ కార్డులు తదితర వాటిని పొందాలన్నా.. నానా అవస్థలు పడాల్సి వస్తోంది. దీర్ఘకాలికంగా ఈ సమస్య వేధిస్తున్నా.. పట్టించుకునే వారే కరువయ్యారు. గత వైసీపీ సర్కారు ప్రభుత్వమైతే.. పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరించింది. గిరిజన ప్రాంతాల్లో నెట్‌వర్క్ సౌకర్యం కల్పనకు కనీస చర్యలు తీసుకోలేదు. వాస్తవంగా గత టీడీపీ ప్రభుత్వ హయాంలో సీతంపేట ఐటీడీఏ పరిధిలో 64 సెల్ టవర్లను మంజూరు చేశారు. వాటికి అవసరమైన స్థల సేకరణ బాధ్యతను ఐటీడీఏలకు అప్పగించారు. ఈ సెల్ టవర్ల నిర్మాణానికి ట్రైకార్ నిధులు మంజూరు చేశారు. అయితే ఆ తర్వాత ఎన్నికలు జరగడం.. వైసీపీ అధికారంలోకి రావడంతో ఆ పనులకు బ్రేక్ పడింది. ఇంతవరకు సెల్‌టవర్ల నిర్మాణం పూర్తిస్థాయిలో జరగలేదు. కొన్నింటి నిర్మాణాలు పూర్తయినా.. వాటికి అవసరమైన సిగ్నల్ వ్యవస్థ ఏర్పాటు చేయకపోవడం వల్ల వృథాగా పడి ఉన్నాయి. దీంతో సెల్‌ఫోన్లకు సిగ్నల్స్ ఉండడం లేదు. అత్యవసర వేళల్లో గిరిజనులు పడరాని పాట్లు పడుతున్నారు. సెల్‌ఫోన్ సిగ్నల్స్ కోసం కొండలు, చెట్లు ఎక్కాల్సి వస్తోంది. రేషన్ సరుకులు, పింఛన్లు, విద్యార్థుల బయోమెట్రిక్, ఉద్యోగులు ఫేస్‌యాప్ వంటి ఆన్‌లైన్ సర్వీసులకు ఇక్కట్లు తప్పడం లేదు. ఆన్‌లైన్ సేవలు పొందాలంటే.. సిగ్నల్స్ వచ్చిన ప్రాంతానికి ఉద్యోగులు, గిరిజనులు తరలివెళ్లాల్సి వస్తోంది. సార్వత్రిక ఎన్నికల్లో కూడా సిగ్నల్స్ లేక పోలింగ్ సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రేషన్ సరుకులకు సంబంధించి 23 స్టాక్ పాయింట్లు ఉన్నప్పటికీ.. వాటిల్లో ఎనిమిది స్టాక్ పాయింట్లకు సెల్ సిగ్నల్స్ లేవు. దీంతో ప్రతినెలా బియ్యం పంపిణీలో జాప్యం జరుగుతోంది. రెండు నెలలకు ఒకసారి స్లిప్పులు ఇచ్చి రైస్ సరఫరా చేస్తున్న పరిస్థితి నెలకొంది. గుమ్మలక్ష్మీపురం మండల పరిధిలో ఉన్న కలిటి గ్రామంలో ఆరు నెలల కిందట సెల్ టవర్‌ను లాంఛనంగా ప్రారంభించారు. అయితే మిగతా అన్ని సెల్ టవర్లు అందుబాటులోకి తీసుకొస్తాయని అధికారులు చెప్పినప్పటికీ.. జిల్లాలో ఆ పరిస్థితి లేదు. ఇంతవరకు సెల్ టవర్ల నిర్మాణ పనులు పూర్తికాలేదు. ఏజెన్సీలో నెట్‌వర్క్ సమస్యను గిరిజన సంఘం నాయకులతో పాటు మన్యం ప్రగతి ఛైర్మన్ గేదెల రవి తదితరులు ఉన్నతాధికారులకు తెలియజేశారు. కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్రంలో కూడా టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గిరిజనుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. సెల్‌టవర్ పనులు త్వరితగతిన పూర్తవుతాయని, నెట్‌వర్క్ సమస్య తొలగిపోతుందని వారు భావిస్తున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం

అత్యవసర పరిస్థితుల్లో ఎవరికైనా ఫోన్ చేయాలంటే తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. రెండు కిలోమీటర్లు నడిచి సెల్ సిగ్నల్స్ ఉన్న చోటకు వెళ్లాల్సి వస్తోంది.

- సవర మంగయ్య, చాపరాయిగూడ

ప్రతి నెలా ఇంతే..

రేషన్ సరుకుల కోసం ప్రతినెలా కొండ కింద గ్రామాలకు వెళ్లాల్సి వస్తోంది. మా గ్రామంలో సెల్ సిగ్నల్స్ ఉండడం లేదు. దీంతో ప్రతినెలా ఈ అవస్థలు తప్పడం లేదు.

- సవర కువ్వారి, రంగంవలస



వలగజ్జి గ్రామంలో సెల్ సిగ్నల్స్ కోసం కొండెక్కిన గిరిజన యువతి



పింఛన్ల జారీ, ఫేస్‌యాప్ కోసం వెలగాపురం జంక్షన్ వద్ద అవస్థలు పడుతున్న సచివాలయ సిబ్బంది (ఫైల్)

చెరువుల్లో చేపల పెంపకానికి

అనుమతులు తప్పనిసరి: జేసీ

పార్వతీపురం, జూలై 5(ఆంధ్రజ్యోతి): చెరువుల్లో చేపల పెంపకానికి అనుమతులు తప్పనిసరి అని జాయింట్ కలెక్టర్ శోభిక తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన మత్స్యశాఖ జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. మత్స్య, వ్యవసాయ, ఇరిగేషన్, గ్రౌండ్ వాటర్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, రెవెన్యూ శాఖలతో ఏర్పాటైన డిస్ట్రిక్ట్ లెవెల్ ఇంప్లిమెంటేషన్ కమిటీ ద్వారా అనుమతులు పొందిన తర్వాత రైతులు తమ సొంత భూమిలో చేపల పెంపకం చేపట్టాలని తెలిపారు. పాచిపెంట మండలం విశ్వనాథపురంలో అనధికారికంగా ఒకరు చెరువులో చేపల పెంపకం చేపడుతున్నట్లు గుర్తించామని జిల్లా మత్స్య శాఖ అధికారి తెలిపారు. చెరువు తవ్వేందుకు కేవలం ప్రొవిజనల్ పర్మిషన్ మాత్రమే పొందారని, ఫైనల్ పర్మిషన్ లేకుండా దేవదాయ శాఖ భూమిని ఆక్రమించి చేపల పెంపకం చేపట్టారని చెప్పారు. కోర్టు ఉత్తర్వుల ప్రకారం 15 రోజుల్లోగా సదరు స్థలం ఖాళీ చేసి తహసీల్దార్‌కు అప్పజెప్పాల్సిందిగా ఆదేశించామన్నారు.

ఏటీఎల్‌ను అత్యున్నత స్థాయికి తీసుకెళ్లాలి

- జిల్లా విద్యాశాఖాధికారి పగడాలమ్మ

పార్వతీపురం టౌన్, జూలై 5 : జిల్లాలో అటల్ టింకరింగ్ ల్యాబ్స్ (ఏటీఎల్)ను అత్యున్నత స్థాయికి తీసుకెళ్లాలని జిల్లా విద్యాశాఖాధికారి (డీఈవో) పగడాలమ్మ ఆదేశించారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏటీఎల్ పాఠశాలల ప్రిన్సిపాళ్లు, హెచ్‌ఎంలు, ల్యాబ్ ఇన్‌చార్జిలతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అటల్ టింకరింగ్ ల్యాబ్స్‌తో ప్రతి పాఠశాల ఒక ఇన్నోవేషన్ హబ్‌గా చేయాలనే సంకల్పంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేస్తున్నాయన్నారు. దీనిలో భాగంగా ఒక్కో పాఠశాలకు రూ. 25 లక్షలు కేటాయించారని తెలిపారు. ఈ ప్రయోగశాలల్లో రోబోటిక్స్, డ్రోన్ టెక్నాలజీ, 3డీ ప్రింటింగ్ వంటి అత్యాధునిక పరికరాలను అందుబాటులో ఉంటాయన్నారు. వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో తమ పాఠశాలల పేరు నిలపాలని సూచించారు.



ఓ మై 'ఘాట్'

చప్పగొత్తిలి- ఆవిరి గ్రామాల మధ్య గల ఘాట్ రోడ్డు ప్రమాదకరంగా మారింది. అసలే ఈ మార్గం ఇరుకుగా ఉండగా.. దారి పొడవునా భారీ గోతులు ఏర్పడ్డాయి. దీనికి తోడు రోడ్డు ఒకవైపు భారీ లోయ, మరోవైపు కొండ ఉంది. ఏ మాత్రం ఏమరుపాటుగా ఉన్నా.. 300 అడుగుల కింద ఉన్న గెడ్డలో పడే ప్రమాదముంది. ఇప్పటికే తరచూ వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. పరిస్థితి ఇంత దారుణంగా ఉన్నా.. ఘాట్‌రోడ్డులో రక్షణ గోడలు ఏర్పాటు చేయకపోవడంతో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తిత్తిరి పంచాయతీ గ్రామాలకు చేరుకోవాలంటే ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందో తెలియక.. అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలని, ఘాట్ రోడ్డులో మలుపుల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు పెట్టాలని, లోయ ఉన్న చోట్ల రిటైనింగ్‌వాల్ నిర్మించాలని డిమాండ్ చేస్తున్నారు.

- కురుపాం రూరల్

వేతనాలు చెల్లించండి

- ఆశావర్కర్ల డిమాండ్ • ఐటీడీఏ ఎదుట ధర్నా

పార్వతీపురం, జూలై 5(ఆంధ్రజ్యోతి): బకాయి వేతనాలు తక్షణమే చెల్లించాలని ఆశావర్కర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం పార్వతీపురం ఐటీడీఏ కార్యాలయం ఎదుట వారు నిరసన కార్యక్రమం చేపట్టారు. గత ఐదు నెలలుగా తమకు వేతనాలు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. కుటుంబ పోషణ భారంగా మారిందని, ఆర్థికంగా అనేక సమస్యలు ఎదుర్కొంటున్నామని వాపోయారు. నిత్యం గిరిజన ప్రాంతాల్లో సేవలందిస్తున్నా.. తమకు వేతనాలు ఇవ్వకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. గుర్తింపు కార్డులు, యూనిఫారాలు ఇవ్వాలని అధికారులకు అనేకమార్లు విన్నవించుకున్నా ఫలితం లేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఐటీడీఏ పీవో విష్ణుచరణ్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ నిరసనలో యూనియన్ నాయకులు కుమారి, అప్పలనర్సమ్మ, భారతి, జీవిత, దమయంతి, దివ్య అరుణ, ధనలక్ష్మి, రజని, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



పార్వతీపురం ఐటీడీఏ కార్యాలయం గేటు వద్ద ధర్నా చేస్తున్న ఆశావర్కర్లు

విద్యుత్ తీగలే యమపాశమై..

- మీసాలపేటలో దంపతులు మృతి
- నారుమడికి నీరు పెట్టేందుకు వెళ్లిన వైనం
- తెగిపడి ఉన్న తీగలు తగలడంతో మృత్యువాత

మెంటాడ, జూలై 5: మెంటాడ మండలం మీసాలపేట గ్రామంలో శుక్రవారం విద్యుదాఘాతంతో భార్యాభర్తలు కోరాడ ఈశ్వరరావు (50), ఆదిలక్ష్మి (48) మృతి చెందారు. ఉదయం 7 గంటల సమయంలో ఈశ్వరరావు తన వరినారు మడికి తడిపెట్టేందుకు పొలానికి వెళ్లాడు. సమీపంలో ఉన్న చెరువు వద్దకు వెళ్లి ఇంజన్ అమర్చి పైపు బిగించేందుకు సిద్ధమవ్వగా అక్కడ పచ్చికలో మూసుకుపోయి ఉన్న విద్యుత్ తీగలు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. భర్త ఎంతకీ తిరిగి రాకపోవడంతో ఉదయం 10 గంటల సమయంలో ఇంటి పని చేయిస్తున్న భార్య ఆదిలక్ష్మి తాపీమేస్త్రిని తీసుకుని పొలం వద్దకు వెళ్లింది. అచేతనంగా పడిఉన్న భర్తను చూసి ఆందోళన చెంది అతన్ని తట్టింది. దీంతో ఆమెకూడా విద్యుత్ షాక్‌కు గురై క్షణాల్లో మృతి చెందింది. సమాచారం తెలుసుకున్న గ్రామస్థులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. విద్యుత్ శాఖ నిర్లక్ష్యం కారణంగానే రెండు నిండు ప్రాణాలు పోయాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిహారం ప్రకటించాకే మృతదేహాలను తరలించాలని గ్రామస్థులు ఆందోళన చేశారు. అక్కడకు చేరుకున్న ఏఈ తిరుపతిరావుతో వాగ్వాదానికి దిగారు. గజపతినగరం సీఐ ప్రభాకర్, విద్యుత్‌శాఖ ఏడీఈ శివకుమార్ గ్రామస్థులతో చర్చించారు. రూ.5లక్షల చొప్పున పరిహారం చెల్లిస్తామని, వారి కుమారుడికి విద్యార్హత బట్టి ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన ఉద్యోగం ఇచ్చేందుకు ఉన్నత అధికారులను కలిసి చర్చిస్తామని ఏడీఈ తెలిపారు. తీగల్లోకి విద్యుత్ ఎలా ప్రవహించిందో విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తెలుసుకుంటామని చెప్పారు. దీంతో గ్రామస్థులు శాంతించారు. అనంతరం మృతదేహాలను పోస్టుమార్టం కోసం పోలీసులు విజయనగరం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



ఆదిలక్ష్మి(ఫైల్)



ఈశ్వరరావు(ఫైల్)

గ్రామంలో విషాదం

ఈశ్వరరావు, ఆదిలక్ష్మికి వ్యవసాయమే జీవనాధారం. ఉన్న కొద్దిపాటి భూమిని సాగుచేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. వీరికి ఇద్దరు సంతానం. కుమారుడు శ్రీనివాసరావు డిగ్రీ పూర్తిచేశాడు. కుమార్తె సునీతకు వివాహ మయ్యింది. దంపతుల మృతితో గ్రామంలో విషాదచాయలు అలముకున్నాయి. వారిని గుర్తుచేసుకుని స్థానికులు, బంధువులు కన్నీటిపర్యంతమయ్యారు.

దర్యాప్తునకు మంత్రి ఆదేశం

ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తునకు మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఆదేశించారు. విద్యుత్ షాక్‌తో భార్యభర్తలు మృతిచెందడం బాధాకరమని, ఈ వార్త తనను ఎంతగానో కలిచివేసిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.



పొలం వద్ద పడిఉన్న మృతదేహాలు

ప్రత్యేక అలంకరణలో

పారమ్మతల్లి

జేష్ఠ్య అమావాస్య సందర్భంగా పారమ్మ కొండపై ఉన్న పారమ్మ తల్లిని శుక్రవారం ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సనాతన ధర్మపరిషత్ ఆధ్వర్యంలో ప్రసాద వితరణ చేశారు.

-సాలూరు రూరల్



తెలంగాణ ఈఏపీసెట్ కౌన్సెలింగ్



రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలల్లో ప్రవేశాలకు ఉద్దేశించిన 'టీజీ ఈఏపీ సెట్ 2024 (ఎంపీసీ స్ట్రీమ్) కౌన్సెలింగ్' ప్రక్రియ ప్రారంభమైంది. ఈ కౌన్సెలింగ్ ద్వారా బీఈ/బీటెక్/ఫార్మసీ కోర్సుల్లో అడ్మిషన్స్ ఇస్తారు. అభ్యర్థులు టీజీ ఈఏపీ సెట్ 2024లో సాధించిన ర్యాంక్ ఆధారంగా సీట్ల అలాట్‌మెంట్ ఉంటుంది. కౌన్సెలింగ్‌లో భాగంగా ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు, స్లాట్ బుకింగ్, సర్టిఫికెట్ వెరిఫికేషన్, వెబ్ ఆప్షన్స్ ప్రక్రియలు ఉంటాయి. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. కౌన్సెలింగ్ ప్రక్రియను మూడు విడతల్లో నిర్వహిస్తారు. చివరలో స్పాట్ అడ్మిషన్స్ ఉంటాయి.

అర్హత: అభ్యర్థులు గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. జనరల్ అభ్యర్థులకు కనీసం 45 శాతం, రిజర్వ్‌డ్ కేటగిరీల అభ్యర్థులకు కనీసం 40 శాతం మార్కులు తప్పనిసరి. అభ్యర్థులందరూ టీజీ ఈఏపీ సెట్ 2024(ఎంపీసీ స్ట్రీమ్) అర్హత పొంది ఉండాలి. అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి ఇంజనీరింగ్, ఫార్మసీ కోర్సులకు 16 ఏళ్లు; ఫార్మాడీ(డాక్టర్ ఆఫ్ ఫార్మసీ) కోర్సుకు 17 ఏళ్లు నిండి ఉండాలి. స్కాలర్‌షిప్ పొందాలంటే 2024 జూలై 1 నాటికి జనరల్ అభ్యర్థులకు 25 ఏళ్లు, రిజర్వ్‌డ్ కేటగిరీల అభ్యర్థులకు 29 ఏళ్లు మించకూడదు.

స్లాట్ బుకింగ్: వెబ్‌సైట్ ఓపెన్ చేసి 'పేమెంట్ ఆఫ్ ప్రాసెసింగ్ ఫీ' లింక్‌పై క్లిక్ చేయాలి. టీజీ ఈఏపీసెట్ 2024 హాల్‌టికెట్ నెంబర్, డేట్ ఆఫ్ బర్త్, ఇంటర్ హాల్ టికెట్ నెంబర్ ఎంటర్ చేయాలి. తరవాత ఆధార్ నెంబర్, మొబైల్ నెంబర్, ఈమెయిల్ ఐడీ తదితర సమాచారం ఎంటర్ చేయాలి. ప్రాసెసింగ్ ఫీజు కింద జనరల్, బీసీ అభ్యర్థులు రూ.1200; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.600 చెల్లించాలి. తరవాత సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం దగ్గరలోని హెల్ప్ లైన్ సెంటర్, డేట్, టైమ్ సెలెక్ట్ చేసుకోవాలి. దివ్యాంగులు, ఎన్‌సీసీ అభ్యర్థులు, క్రీడాకారులు, సీఏపీ అభ్యర్థులు, ఆంగ్లో ఇండియన్ వంటి స్పెషల్ కేటగిరీ అభ్యర్థులు మాత్రం హైదరాబాద్-మాసబ్‌ట్యాంక్ వద్దగల గవర్నమెంట్ పాలిటెక్నిక్ సెంటర్‌ను ఎంచుకోవాలి. ఈ కేటగిరీలకు నిర్దేశించిన తేదీల ప్రకారం సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరు కావాల్సి ఉంటుంది. క్రీడాకారులు, సీఏపీ అభ్యర్థులకు జూలై 6 నుంచి 8 వరకు; ఎన్‌సీసీ అభ్యర్థులకు జూలై 9 నుంచి 12 వరకు; దివ్యాంగులు, ఆంగ్లో ఇండియన్ అభ్యర్థులకు జూలై 13న సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహిస్తారు.

సర్టిఫికెట్ వెరిఫికేషన్: హెల్ప్‌లైన్ సెంటర్‌కు వెళ్లే అభ్యర్థులు తమ వెంట టీజీ ఈఏపీసెట్ 2024 ర్యాంక్ కార్డ్, హాల్ టికెట్; ఆధార్ కార్డ్; పదోతరగతి సర్టిఫికెట్, ఇంటర్ మెమో-పాస్ సర్టిఫికెట్, ఆరోతరగతి నుంచి ఇంటర్ వరకు స్టడీ సర్టిఫికెట్లు, టీసీ; 2024 జనవరి 1న గానీ ఆ తరవాత గానీ తీసిన ఇన్‌కం సర్టిఫికెట్, వ్యాలిడ్ ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్, కులం, స్థానికత, వైకల్యం, ఎన్‌సీసీ, క్రీడలు తదితర ధ్రువీకరణ పత్రాలకు సంబంధించిన ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు రెండు సెట్ల జిరాక్స్ కాపీలు తీసుకెళ్లాలి.

- సర్టిఫికెట్ల వెరిఫికేషన్ తరవాత అధికారులు ఇచ్చిన ఆర్ఓసీని చెక్ చేసుకోవాలి. తరవాత అభ్యర్థుల మొబైల్‌కు లాగిన్ ఐడీ పంపుతారు. ఈ ఐడీ వచ్చిన తరవాతనే హెల్ప్‌లైన్ సెంటర్ నుంచి బయటకు రావాలి. దీని ద్వారా అభ్యర్థులు వెబ్ ఆప్షన్స్ పెట్టుకోవచ్చు.

ఫస్ట్ ఫేజ్ కౌన్సెలింగ్ షెడ్యూల్

- **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, స్లాట్ బుకింగ్:** జూలై 12 వరకు
- **సర్టిఫికెట్ వెరిఫికేషన్:** జూలై 6 నుంచి 13 వరకు
- **వెబ్ ఆప్షన్స్:** జూలై 8 నుంచి 15 వరకు
- **ఆప్షన్ల ఫ్రీజింగ్:** జూలై 15
- **సీట్ల అలాట్‌మెంట్:** జూలై 19
- **సెల్ఫ్ రిపోర్టింగ్:** జూలై 19 నుంచి 23 వరకు

సెకండ్ ఫేజ్ కౌన్సెలింగ్ షెడ్యూల్

- **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, స్లాట్ బుకింగ్:** జూలై 26
- **సర్టిఫికెట్ వెరిఫికేషన్:** జూలై 27
- **వెబ్ ఆప్షన్స్:** జూలై 27 నుంచి 28 వరకు
- **ఆప్షన్ల ఫ్రీజింగ్:** జూలై 28
- **సీట్ల అలాట్‌మెంట్:** జూలై 31
- **సెల్ఫ్ రిపోర్టింగ్:** జూలై 31 నుంచి ఆగస్టు 2 వరకు

ఫైనల్ ఫేజ్ కౌన్సెలింగ్ షెడ్యూల్

- **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, స్లాట్ బుకింగ్:** ఆగస్టు 8
- **సర్టిఫికెట్ వెరిఫికేషన్:** ఆగస్టు 9
- **వెబ్ ఆప్షన్స్:** ఆగస్టు 9 నుంచి 10 వరకు
- **ఆప్షన్ల ఫ్రీజింగ్:** ఆగస్టు 10
- **సీట్ల అలాట్‌మెంట్:** ఆగస్టు 13
- **సెల్ఫ్ రిపోర్టింగ్:** ఆగస్టు 13 నుంచి 15 వరకు

సెంట్రలైజ్డ్ ఇంటర్నల్ స్లయిడింగ్ షెడ్యూల్

- **వెబ్ ఆప్షన్స్:** ఆగస్టు 21 నుంచి 22 వరకు
- **ఫ్రీజింగ్ ఆప్షన్స్:** ఆగస్టు 22 ● **సీట్ల అలాట్‌మెంట్:** ఆగస్టు 26
- **సెల్ఫ్ రిపోర్టింగ్:** ఆగస్టు 27 నుంచి 28 వరకు
- **స్పాట్ అడ్మిషన్స్‌గైడ్‌లైన్స్ విడుదల:** ఆగస్టు 28
- **వెబ్‌సైట్:** tgeapcet.nic.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/0fXXywPలో చదవండి.

దిక్సూచి DIKSUCHI

ఎన్‌జీ రంగా వర్సిటీలో యూజీ ఎన్ఆర్ఐ కోటా

గుంటూరులోని ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ(ఏఎన్‌జీఆర్ఏయూ)-వ్యవసాయ డిగ్రీ ప్రోగ్రామ్‌లలో ఎన్ఆర్ఐ కోటా సీట్ల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. అడ్మిషన్‌కు ఏపీ ఈఏపీసెట్ 2024 స్కోర్ అవసరం లేదు. ఇంటర్/తత్సమాన కోర్సుల్లో సాధించిన మార్కుల ఆధారంగా మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించి అర్హులకు ప్రవేశాలు కల్పిస్తారు. బీఎస్సీ ఆనర్స్(అగ్రికల్చర్/కమ్యూనిటీ సైన్స్), బీటెక్(ఫుడ్ టెక్నాలజీ/అగ్రికల్చరల్ ఇంజనీరింగ్) ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. ప్రవాస భారతీయుల పిల్లలు, వారు స్పాన్సర్ చేసిన బంధువుల పిల్లలు దరఖాస్తు చేసుకోవచ్చు.

ప్రోగ్రామ్‌లు-సీట్లు: బీఎస్సీ ఆనర్స్ అగ్రికల్చర్ ప్రోగ్రామ్‌లో 147 సీట్లు, బీటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్) ప్రోగ్రామ్‌లో 20 సీట్లు, బీటెక్(ఫుడ్ టెక్నాలజీ) ప్రోగ్రామ్‌లో 23 సీట్లు, బీఎస్సీ ఆనర్స్ కమ్యూనిటీ సైన్స్ ప్రోగ్రామ్‌లో 15 సీట్లు చొప్పున మొత్తం 205 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథమెటిక్స్/బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంగ్లీష్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండో తరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. బీఎస్సీ(ఆనర్స్) అగ్రికల్చర్ ప్రోగ్రామ్‌నకు బయాలజీ, బీటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్)కు మేథమెటిక్స్ ప్రధాన సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి. 2024 డిసెంబరు 31 నాటికి అభ్యర్థుల వయసు 17 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.

దరఖాస్తు విధానం: వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొన్న దరఖాస్తు ఫారాన్ని నింపి ఇంటర్, పదో తరగతి మార్కుల పత్రాలు; ఆరోతరగతి నుంచి ఇంటర్ వరకు స్టడీ సర్టిఫికెట్లు, టీసీ, మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్, ఎన్ఆర్ఐ వీసా-పాస్‌పోర్ట్-ఆదాయం ధ్రువీకరణ పత్రాలు జతచేసి కింది చిరునామాకు పంపాలి. ఎన్ఆర్ఐ స్పాన్సర్డ్ కేటగిరీకి విద్యార్థి తల్లిదండ్రుల వివరాలకు సంబంధించిన అఫిడవిట్, స్పాన్సరర్ ధ్రువీకరణ పత్రం కూడా సబ్మిట్ చేయాలి.

- **దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** జూలై 25
- **వెబ్‌సైట్:** angrau.ac.in

ఐఐపీలో ప్యాకేజింగ్ ప్రోగ్రామ్‌లు

ముంబైలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్(ఐఐపీ)- ఎంఎస్ ఇన్ ప్యాకేజింగ్ టెక్నాలజీ, పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ప్యాకేజింగ్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఒక్కో కోర్సు వ్యవధి రెండేళ్లు. కోర్సుకు నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. సంస్థ నిర్వహించే కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(ఐఐపీ సెట్)2024, పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. ఆన్‌లైన్ మోడ్‌లో సర్టిఫయిడ్ ప్యాకేజింగ్ ఇంజనీర్ కోర్సును కూడా అందిస్తున్నారు. దీని వ్యవధి ఏడాది. ఈ కోర్సులో ప్రవేశానికి ఎంట్రెన్స్ రాయనవసరం లేదు. కోర్సులు పూర్తయ్యే నాటికి క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తారు.

సీట్లు

పీజీ డిప్లొమా: ముంబై క్యాంపస్‌లో 280 సీట్లు, కోల్‌కతా క్యాంపస్‌లో 80 సీట్లు, అహ్మదాబాద్ క్యాంపస్‌లో 60 సీట్లు ఉన్నాయి.
ఎంఎస్: హైదరాబాద్ క్యాంపస్‌లో 40 సీట్లు ఉన్నాయి.
సీపీఈ: చెన్నై క్యాంపస్‌లో 60 సీట్లు ఉన్నాయి.

కోర్సులు

- పీజీ డిప్లొమా ఇన్ ప్యాకేజింగ్
- ఎంఎస్ ఇన్ ప్యాకేజింగ్ టెక్నాలజీ
- సీపీఈ ఇన్ ప్యాకేజింగ్ టెక్నాలజీ



అర్హత: పీజీడీపీ ప్రోగ్రామ్‌నకు గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఫిజిక్స్/కెమిస్ట్రీ/మేథమెటిక్స్/మైక్రోబయాలజీ/బయో కెమిస్ట్రీ ఒక సబ్జెక్టుగా డిగ్రీ పూర్తిచేసి ఉండాలి. అగ్రికల్చర్/ఫుడ్ సైన్స్/పాలిమర్ సైన్స్/ఇంజనీరింగ్/టెక్నాలజీ డిగ్రీ అభ్యర్థులు కూడా అర్హులే. ఎంఎస్ ప్రోగ్రామ్‌నకు బీఈ/బీటెక్/నాలుగేళ్ల డిగ్రీ ఇన్ ఇంటిగ్రేటెడ్ సైన్సెస్ ఉత్తీర్ణులై ఉండాలి. సీపీఈ ప్రోగ్రామ్‌నకు బీఈ/బీటెక్ పూర్తిచేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ద్వితీయ శ్రేణి మా ర్కులు తప్పనిసరి. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలు రాసిన/రాసేవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. కరస్పాండెన్స్, పార్ట్ టైం డిగ్రీలు చేసినవారు దరఖాస్తుకు అనర్హులు. పీజీడీపీ, ఎంఎస్ ప్రోగ్రామ్‌లకు అభ్యర్థుల వయసు 2024 మే 31 నాటికి 30 ఏళ్లు మించకూడదు. ఓబీసీలకు మూడేళ్లు; ఎస్సీ, ఎస్టీలకు అయిదేళ్లు వయోపరిమితి సడలింపు వర్తిస్తుంది. సీపీఈ ప్రోగ్రామ్‌నకు వయోపరిమితి నిబంధనలు లేవు.

ఐఐపీ సెట్: ఇది ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. అన్నీ మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలే ఇస్తారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథమెటిక్స్, ఇంజనీరింగ్ విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నలన్నీ డిగ్రీ స్థాయిలోనే ఉంటాయి. అభ్యర్థులు నిర్దేశిత సంఖ్య మేరకు ప్రశ్నలు ఎంచుకొని సమాధానాలు గుర్తించాలి.

ఎంపిక: సంస్థ నిర్ణయించిన ప్రకారం కటాఫ్ మార్కులు సాధించిన వారిని షార్ట్‌లిస్ట్ చేసి పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. పదోతరగతి మార్కులకు 10 శాతం, ఇంటర్/పన్నెండో తరగతి మార్కులకు 10 శాతం, డిగ్రీ మార్కులకు 30 శాతం, రాత పరీక్ష స్కోరుకు 30 శాతం, ఇంటర్వ్యూలో సాధించిన మార్కులకు 20 శాతం వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.500
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 10
- **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, ముంబై, కోల్‌కతా, ఢిల్లీ, చెన్నై, అహ్మదాబాద్
- **ఐఐపీ సెట్ 2024 తేదీ:** జూలై 14
- **ఎంపికైన అభ్యర్థుల షార్ట్‌లిస్ట్ విడుదల:** జూలై 16
- **పర్సనల్ ఇంటర్వ్యూలు:** జూలై 18, 19
- **అడ్మిషన్ పొందిన అభ్యర్థుల జాబితా విడుదల:** జూలై 22
- **ప్రోగ్రామ్ ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ:** జూలై 29
- **ప్రోగ్రామ్‌లు ప్రారంభం:** ఆగస్టు 5 నుంచి
- **వెబ్‌సైట్:** www.iip-in.com

నవ్య | చిత్రజ్యోతి

టికెట్ ధరల పెంపుపై సీఎంతో పవన్ చర్చిస్తానన్నారు



\- సి. అశ్వనీదత్

కొత్త సినిమాలు విడుదలైన ప్రతిసారీ టికెట్ ధర పెంచాలని ప్రభుత్వాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా శాశ్వత ప్రాతిపదికన ఓ విధానం తీసుకురావాలనేదే ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అభిమతమని నిర్మాత సి. అశ్వనీదత్ అన్నారు. టికెట్ ధరల పెంపు అంశం గురించి ఇటీవల ఆయన ఓ ఇంటర్వ్యూలో వెలిబుచ్చిన అభిప్రాయాలపై కొన్ని అపోహలు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం సోషల్ మీడియా వేదికగా వాటిపై అశ్వనీదత్ స్పష్టతనిచ్చారు. 'బడ్జెట్‌ను బట్టి టికెట్ ధరలు ఎంతవరకూ పెంచవచ్చు, అలాగే ధరల పెంపు పది రోజులా?, వారమా? అనేది నిర్మాతలంతా కూర్చొని, చర్చించుకొని వస్తే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారితో స్వయంగా చర్చిస్తానని పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారు' అని తెలిపారు. నిర్మాతలకు అండగా ఉంటానని ప్రేక్షకులకూ, పరిశ్రమ వర్గాలకు ఆమోదయోగ్యమైన నిర్ణయాన్ని కలసికట్టుగా తీసుకుందాం అని పవన్ కల్యాణ్ భరోసా ఇచ్చారని అశ్వనీదత్ ప్రకటనలో తెలిపారు.

పుట్టిన రోజు.. రెండు అప్‌డేట్స్



నందమూరి కల్యాణ్‌రామ్ పుట్టిన రోజు సందర్భంగా ఆయన నటిస్తున్న 21వ చిత్రం లుక్ పోస్టర్‌ను శుక్రవారం రిలీజ్ చేశారు. తన పిడికిలి బిగించి ఫైర్‌తో, కుర్చీలో కూర్చున కల్యాణ్‌రామ్ తన చుట్టూ ఉన్న గూండాలని ఇంటెన్స్‌గా చూస్తున్నట్లు పోస్టర్ పవర్‌ఫుల్‌గా ప్రజెంట్ చేస్తోంది. ఈ సినిమాలో కల్యాణ్‌రామ్ కొన్ని డేర్ డెవిల్ స్టంట్స్ చేయనున్నారు. అలాగే ఫైర్ యాక్షన్ ఎపిసోడ్ ప్రధాన ఆకర్షణగా ఉంటుందని దర్శకుడు ప్రదీప్ చిలుకూరి చెప్పారు. సీనియర్ నటి విజయశాంతి పోలీస్ ఆఫీసర్‌గా నటిస్తున్న ఈ చిత్రం షూటింగ్ శరవేగంతో జరుగుతోంది. సోహైల్ ఖాన్, సాయి మంజ్రేకర్, శ్రీకాంత్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రాన్ని ముప్పా వెంకయ్య చౌదరి సమర్పణలో అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు సంయుక్తంగా నిర్మిస్తున్నారు.

బింబిసారకు సీక్వెల్

అలాగే కల్యాణ్‌రామ్ పుట్టిన రోజు సందర్భంగానే 'బింబిసార 2' కాన్సెప్ట్ పోస్టర్ విడుదల చేశారు. కల్యాణ్‌రామ్ కెరీర్‌లోనే అత్యంత భారీ విజయాన్ని సొంతం చేసుకున్న 'బింబిసార' చిత్రానికి సీక్వెల్ ఉంటుందని మేకర్స్ ఎప్పుడో ప్రకటించారు. ఆయన పుట్టినరోజు సందర్భంగా ఆ చిత్రం వివరాలను వెల్లడించారు. బింబసార కంటే యుగాల ముందు త్రిగర్తల రాజ్యాన్ని ఏలిన లెజెండ్‌ను చూడడానికి సిద్ధంగా ఉండండి' అని శుక్రవారం అనౌన్స్ చేశారు. స్క్రీన్ మీద ఇప్పటిదాకా ఎవరూ చూడనటువంటి స్థాయిలో త్రిగర్తలను ప్రదర్శించడానికి సన్నాహాలు ప్రారంభించారు. ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ఎన్టీఆర్ ఆర్ట్స్ సంస్థ నిర్మించే ఈ చిత్రానికి అనిల్ పాదూరి దర్శకుడు.



అన్నింటికీ సమాధానం పార్ట్-2లో ఉంటుంది

సినిమా సినిమాకు అంచెలంచెలుగా ఎదిగిన డైరెక్టర్లు కొందరైతే.. చేసిన కొన్ని సినిమాలతోనే అపారమైన ప్రతిభావంతులుగా గుర్తింపు తెచ్చుకున్న దర్శకులు కొంతమంది. ఆ రెండో కోవకు వస్తారు డైరెక్టర్ నాగ్ అశ్విన్. డైరెక్టర్‌గా తొలి ప్రాజెక్ట్ 'ఎవడే సుబ్రమణ్యమ్'తో సున్నితమైన ఎమోషన్స్ ఉన్న సినిమాలను బాగా హ్యాండిల్ చేయగలడని నిరూపించుకున్నారు. రెండో సినిమా 'మహానటి'తో మంచి అభిరుచి ఉన్న దర్శకుడిగా పేరు తెచ్చుకుని.. మూడవ సినిమాగా ఇండియాలోనే అత్యంత భారీ బడ్జెట్‌తో రూపొందిన 'కల్కి 2898 ఏ.డీ' సినిమాను తెరకెక్కించారు. సినిమాను దృశ్యకావ్యంలా మలచి.. విమర్శకుల చేత, ప్రేక్షకుల చేత ఔరా! అనిపించుకున్నారు నాగ్ అశ్విన్. సినిమా విడుదలైన అన్ని చోట్లా సూపర్ హిట్ టాక్‌తో దూసుకుపోతున్న సందర్భంగా శుక్రవారం ఆయన మీడియాతో ముచ్చటించారు.

"ముందుగా ఇంతటి ఘనవిజయాన్ని అందించిన ప్రేక్షకులకు ధన్యవాదాలు. మన పురాణాల్లో అద్భుతమైన కథలు ఉన్నాయి. పురాణాలకు కాసింత సృజనాత్మకత జోడించి ఈ సినిమాను తెరకెక్కిద్దామనుకున్నాను. 'మాయాబజార్' సినిమా ఈ ఆలోచనకు స్ఫూర్తి. మొదటగా ఈ సినిమాను ఒక భాగంగానే తెరకెక్కించాలనుకున్నా. షూటింగ్ కూడా ఆ విధంగానే సాగింది. కానీ కొన్ని షెడ్యూళ్ల షూటింగ్ తర్వాత.. ఇంత కాన్వాస్ ఉన్న కథను రెండు భాగాలుగా విడదీద్దాం అనే ఆలోచన వచ్చింది. పార్ట్-2కి సంబంధించి 20 రోజుల షూటింగ్ చేశాం. కథకు న్యాయం చేసే పాత్రల్ని వెతికే సమయంలో సినిమాలోని కీలక పాత్రలకు అమితాబ్, కమల్‌హాసన్, దీపిక పదుకునే వంటి స్టార్స్ అయితే కరెక్ట్ అని భావించి వారిని తీసుకున్నాం. ఈ సినిమాతో నాలుగున్నరేళ్ల చిత్రబృందం ప్రయాణం చేసింది. ఈ సమయంలో వారెన్నో సవాళ్లను దాటుకొని చిత్ర విజయానికి దోహదపడ్డారు. ప్రభాస్‌కు మొదటి నుంచి సినిమాపై అపార నమ్మకం ఉండేది. ఆయన ప్రోత్సాహమే కష్టసమయాల్లో నన్ను, నిర్మాతల్ని ముందుకు నడిపించింది. సినిమా చూసినవారందరూ అనేక ప్రశ్నలు అడుగుతున్నారు. వాటన్నింటికీ సమాధానం పార్ట్-2లో ఉంటుంది. 'కల్కి' అవతారంలో ఏ నటుడ్ని చూపిస్తాం తెలియడానికి మరింత సమయం ఉంది" అని చెప్పారు.

హాని చేయాలనే తలంపు లేదు



సమంత

టాలీవుడ్ అగ్ర కథానాయిక సమంత వివాదంలో చిక్కుకున్నారు. ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టిన ఓ పోస్ట్ వైద్య వర్గాల నుంచి తీవ్ర విమర్శలు ఎదుర్కొంటోంది. గత వారం సమంత నెబ్యులైజర్‌ను ఉపయోగిస్తున్న ఫొటోను షేర్ చేసి, 'వైరల్ ఇన్ఫెక్షన్లు వచ్చినప్పుడు మందులకు బదులుగా హైడ్రోజన్ పెరాక్సైడ్, డిస్టిల్డ్ వాటర్ కలిపి పీల్చితే మేజిక్‌లాగా పనిచేస్తుంది' అని సూచించారు. అయితే ఈ విధానాన్ని కొంతమంది వైద్యులు సోషల్ మీడియాలో తప్పుపట్టారు. అప్పటికే దెబ్బ తిన్న ఊపిరి తిత్తులలోకి హైడ్రోజన్ పెరాక్సైడ్ ప్రవేశిస్తే, న్యుమోనియా సహా పలు వ్యాధులను కలగజేస్తుంది. కొన్నిసార్లు మరణానికి దారి తీస్తుందని హెచ్చరించారు. 'ఇంతకంటే బుద్ధి తక్కువ పని లేదు. సమంతకు ఆరోగ్యం, విజ్ఞానశాస్త్రం గురించి ఏమీ తెలియదు. ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నందుకు ఆమెను జైలుకు పంపాల'ని ఫిలిప్స్ అనే వైద్యుడు సమంతను ఘాటుగా విమర్శించారు. స్పందించాడు. తనపై విమర్శలు రావడంతో స్పందించిన సమంత, మర్యాదకరమైన భాష ఉపయోగించాలని ఆ డాక్టర్‌ను కోరారు. 'ఇవన్నీ నాకు వైద్యులు చెప్పిన సలహాలే , ఎవరికీ చెడు చేయాలనే తలంపు నాకు లేదు. నన్ను లక్ష్యంగా చేసుకునే బదులు, ఈ విధానాన్ని నాకు సూచించిన డాక్టర్‌తో మీరు చర్చ జరిపితే బావుండేద'న్నారు. సమంత వివరణపై శుక్రవారం డాక్టర్ ఫిలిప్స్ స్పందిస్తూ, బాధితురాలిగా చూపించుకునే ప్రయత్నం మానుకోని, నిజా నిజాలు తెలుసుకొనేందుకు ప్రయత్నం చేయాలని సమంతకు సూచించారు. మానిటైజేషన్ కోసమే కొంతమంది సెలబ్రిటీలు ఇలాంటివి చేస్తున్నారని, వారికి ప్రజల ఆరోగ్యం పట్ల బాధ్యత లేదన్నారు.

రజనీ రాజసం



లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో రజనీకాంత్ కథానాయకుడిగా తెరకెక్కుతోన్న చిత్రం 'కూలీ'. ప్రస్తుతం హైదరాబాద్‌లో చిత్రీకరణ సాగుతోంది. నెల రోజుల పాటు సాగే ఈ షెడ్యూల్‌లో పాల్గొనేందుకు రజనీకాంత్ ఇటీవలే హైదరాబాద్ చేరుకున్నారు. శుక్రవారం చిత్రీకరణ మొదలుపెట్టినట్లు నిర్మాణసంస్థ సన్ పిక్చర్స్ సోషల్ మీడియా ద్వారా తెలిపింది. దీంతో పాటు రజనీకాంత్ స్టైల్‌గా కుర్చీలో కూర్చొని రాజసం ఉట్టిపడే లుక్‌లో ఉన్న పోస్టర్‌ను షేర్ చేసింది. అనిరుధ్ రవిచంద్రన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు.

కూలీలో శ్రుతి ఖాయం

'కూలీ' చిత్రంలో శ్రుతీహాసన్ నటించబోతున్నారనే మాట కొన్నాళ్లుగా మీడియాలో వినిపిస్తోంది. కానీ చిత్రబృందం ఇప్పటివరకూ అధికారికంగా స్పందించలేదు. శుక్రవారం శ్రుతీహాసన్ ఈ సస్పెన్స్‌కు తెరదించారు. ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో తన ఫొటోను పోస్ట్ చేసిన శ్రుతీ 'కూలీ డే 1 షూటింగ్' అని రాసుకొచ్చారు. దీంతో ఈ చిత్రంలో ఆమె నటించడం ఖాయమైనట్లే.

అడవిలో అందాల భామ

తమిళ హీరో ధనుష్, టాలీవుడ్ మన్మథుడు నాగార్జున కలయికలో తెరకెక్కుతోన్న మల్టీస్టారర్ 'కుబేర'. ప్రస్తుతం హైదరాబాద్‌లో చిత్రీకరణ జరుగుతోంది. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతోంది. రష్మిక మందన్న కథానాయిక. శుక్రవారం చిత్రబృందం రష్మిక ఫస్ట్ లుక్, క్యారెక్టర్ ఇంట్రడక్షన్ గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఫస్ట్ లుక్‌లో రాత్రిపూట డబ్బుతో ఉన్న ట్రాలీ బ్యాగ్‌తో అడవిలో నడుచుకుంటూ వెళ్తున్న రష్మిక లుక్ ఆసక్తికరంగా ఉంది. సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్ మోహన్‌రావు భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రానికి దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు.



'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/PZmAgAJ లో చదవండి.

పవర్‌ఫుల్ పెదకాపు



హాస్య నటుడు అలీ కుటుంబానికి చెందిన సదన్ హీరోగా పరిచయమవుతున్న 'ప్రణయ గోదారి' చిత్రంలో పెదకాపుగా ఓ పవర్‌ఫుల్ పాత్ర పోషిస్తున్నారు సాయికుమార్. ఆయన లుక్‌కు సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం తెలంగాణ రాష్ట్ర శాసన సభ్యుడు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి విడుదల చేశారు. తమ మునుగోడు ప్రాంతానికి చెందిన పారుమళ్ల లింగయ్య నిర్మిస్తున్న 'ప్రణయగోదారి' విజయం సాధించాలని రాజగోపాల్‌రెడ్డి కోరుకున్నారు. 'ఫీల్‌గుడ్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం రూపుదిద్దుకుంటోంది. అన్నివర్గాల వారినీ అలరించే అంశాలు చిత్రంలో ఉన్నాయి. గోదారి అందాలు, అక్కడి ప్రజల జీవన విధానాలు ప్రేక్షకులను అలరిస్తాయి. అతి త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తాం' అని చెప్పారు నిర్మాత పారుమళ్ల లింగయ్య. పి.ఎల్.విఘ్నేశ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు.

అల్ఫా గర్ల్



యశ్‌రాజ్ ఫిల్మ్స్ స్పై యూనివర్స్‌లో ఫస్ట్ ఫిమేల్ లీడ్‌గా అలియా భట్ అరుదైన ఘనత పొందారు. ఆదిత్య చోప్రా నిర్మిస్తున్న ఈ చిత్రానికి 'అల్ఫా' అనే పేరు పెట్టారు. ఈ టైటిల్‌కు మగవారు మాత్రమే కాదు మహిళలు కూడా అర్హులే అని సమాజానికి గట్టిగా చాటి చెప్పాలనే ధ్యేయంతో ఈ టైటిల్ నిర్ణయించినట్లు ఆదిత్య చోప్రా చెప్పారు. ఇందులో శార్వరి మరో కీలక పాత్ర పోషిస్తున్నారు. యశ్‌రాజ్ ఫిల్మ్స్ సంస్థ నిర్మించిన రైల్వే మెన్' చిత్రానికి దర్శకత్వం వహించిన శివ్ రవైల్ ఈ సినిమాకు దర్శకుడు.

ఆడపిల్ల తిరగబడితే...



నటి లావణ్య ప్రధాన పాత్ర పోషిస్తున్న క్రైమ్ థ్రిల్లర్ 'ఇజ్జత్'. పరువు హత్యల నేపథ్యంలో రూపొందుతున్న చిత్రమిది. ఉపేంద్ర ఎస్‌పీ దర్శకత్వంలో శ్రీను కందుల నిర్మిస్తున్నారు. శుక్రవారం దర్శకుడు సునీల్‌కుమార్ రెడ్డి 'ఇజ్జత్' టైటిల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉపేంద్ర మాట్లాడుతూ 'ఒక మధ్య తరగతి అమ్మాయి కథే 'ఇజ్జత్' చిత్రం. పరువు హత్యకు సిద్ధపడిన తల్లీతండ్రులకు ఎదురు తిరిగే ధైర్యవంతురాలిగా కథానాయిక కనిపిస్తుంది. ఒక ఆడపిల్ల తిరగబడితే ఎలా ఉంటుందో చెప్పే చిత్రమే మా 'ఇజ్జత్' అన్నారు. నిర్మాత మాట్లాడుతూ 'గతంలో పరువు హత్యల మీద వచ్చిన చిత్రాలకు 'ఇజ్జత్' భిన్నంగా ఉంటుంది. కొత్త తరహా కథనంతో క్వాలిటీ విజువల్స్‌తో నిర్మిస్తున్నాం. ఫస్ట్ కాపీ సిద్ధమవుతోంది. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తాం' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: సురేశ్ బొబ్బిలి. సినిమాటోగ్రఫీ: వీఆర్‌కే నాయుడు.



విద్యార్థులకు విద్యా కిట్లు పంపిణీ చేస్తున్న లలితకుమారి

నాణ్యమైన విద్యనందించాలి

● శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

వేపాడ: ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి కోరారు. శనివారం మండలంలోని సోంపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు విద్యా కిట్లును అందజేశారు. మండల విద్యాశాఖాధికారులు జగదీష్, బాలభాస్కరరావు ప్రభుత్వం మండలంలోని 2,687 మంది విద్యార్థులకు మంజూరు చేసిన స్టూడెంట్ కిట్లును అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో నిచ్చల, హెచ్ఎం బీపీఏరాజు, మాజీ ఎంపీపీ దాసరిలక్ష్మి, టీడీపీ మండల కార్యదర్శి కోట్యాడ రమణమూర్తి, సర్పంచ్ మురుపిండి గంగరాజు, ఎంపీటీసీ సభ్యుడు ఆకుల సత్తిబాబు, సుంకరి అప్పారావు, జొన్నపల్లి సత్తిబాబు పాల్గొన్నారు. కాగా సోంపురం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని మేడపురెడ్డి హసిని ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌కు ఎంపిక కావడంతో ఎమ్మెల్యే లలితకుమారి అభినందించారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి

● విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

విజయనగరం రింగురోడ్డు: ప్రతివిద్యార్థి ప్రభుత్వం కల్పించే అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, కష్టపడి చదవాలని విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు పిలుపునిచ్చారు. శుక్రవారం విజయనగరంలోని కస్పా హైస్కూల్‌లో విద్యార్థులకు విద్యాకిట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మామిడి అప్పలనాయుడు, జడ్పీటీసీ కెల్ల శ్రీనివాసరావు, డివిజన్ కార్పొరేటర్ సయ్యద్ గౌస్, మాజీ కౌన్సిలరు చెన్నా రూపా వాణి, కమిషనర్ ఎంఎం నాయుడు, హెచ్ఎం శంకరరావు, ఎంఈవో రాజు,టీడీపీ నాయకులు ఐవీపీ రాజు, ప్రసాదుల ప్రసాద్, ఆల్తి బంగారుబాబు, పిళ్లా విజయ్‌కుమార్, అవనాపు విజయ్‌పాల్గొన్నారు. కాగా విజయనగరంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎమ్మెల్యే అదితిగజపతిరాజు ప్రిన్సిపాల్ పద్మలీల, డీఎంహెచ్‌వో భాస్కరరావుతో కలిసి అన్నివిభాగాలను పరిశీలించారు. ఈసందర్భంగా బోధనపై ఆరాతీశారు. కార్యక్రమంలో ప్రభుత్వఆసుపత్రి సూపరిటెండెంట్ ఎస్.అప్పలనాయుడు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు..



విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగ్‌లు పంపిణీచేస్తున్న ఎమ్మెల్యే అదితిగజపతిరాజు

గత ప్రభుత్వం వల్లే ఆస్పత్రుల్లో సమస్యలు

● బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన

బొబ్బిలి: గత ప్రభుత్వ చేతగానితనం, నిర్లక్ష్యం వల్ల ఆస్పత్రుల్లో సమస్యలు తిష్టవేశాయని ఎమ్మెల్యే బేబీనాయన ధ్వజమెత్తారు. శుక్రవారం బొబ్బిలి సీహెచ్‌సీలో ఆసు పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం వైద్యాధికారి జి.శశిభూషణరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వందపడకల ఆసుపత్రిగా తీర్చిదిద్దాల్సిన అవసరంఉన్నా, జాప్యం జరుగుతోందని, ఆసుపత్రికి కావాల్సిన అవసరాల కోసంఅంచనాలు రూపొందించి నివేదిక ఇవ్వాలని ఎమ్మెల్యే ఆదేశించారు.అనంతరం బేబీనాయన విలేకరులతో మాట్లాడుతూ తనకు తెలిసిన పారిశ్రామికవేత్తల హామీ మేర కు బొబ్బిలి, బాడంగి సీహెచ్‌సీలకు కోటిరూపాయల సీఎస్ఆర్ నిధులు త్వరలోరానున్నాయన్నారు. బొబ్బిలికి, చీపురుపల్లికి ఒకేవిధంగా నిధులు మంజూరయ్యాయని, అక్కడ రెండంతస్తుల భవనాలు నిర్మించారని, ఇక్కడ తీవ్రజాప్యం చేయడంతో నిర్మా ణవ్యయం భారీగా పెరిగిపోయి పైఅంతస్థు నిర్మాణం జరగలేదన్నారు.సుజయ్‌కృష్ణరంగారావు మంత్రిగా ఉన్నప్పుడు 50 పడకల ఆసుపత్రి కోసం నిధులు మంజూరయ్యాయని, అయినా ఐదేళ్లలో పనులను పూర్తి చేయలేకపోయారన్నారు. ఏపీఎస్ఎంఐడీసీ ఇంజినీరింగ్‌అధికారులతో సమావేశం నిర్వహించి అంచనాలను తయారు చేస్తామని, నిధుల కోసం తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈలోగా సీఎస్ఆర్ నిధులతో అత్యవసర సదుపాయాలను కల్పిస్తామని చెప్పారు. ఓపీలో రోగులకు సౌకర్యాలు, కంప్యూటర్లు, ఫ్రీజరు బాక్సులు, ఫర్నీచరు తదితర వాటిని సమకూర్చుతామని హామీ ఇచ్చారు. ఓపెన్ డ్రైనేజీని కవర్ చేస్తామని, పాతభవనంతో పాటు పోస్టుమార్టం రూముకు మరమ్మతులు చేస్తామన్నారు. విద్యుత్ మరమ్మతుల నిమిత్తం మున్సిపల్ సిబ్బంది సేవలను వినియోగించాలని ఆదేశాలిచ్చినట్లు తెలిపారు. సమావేశంలో డాక్టర్లు రామ్ నరేశ్, రెడ్డి రవికుమార్, హారికబుష్ప, సంతోషిణి, ఎంపీడీవో రవికుమార్, మున్సిపల్ మేనేజరు శివప్రసాదరావు పాల్గొన్నారు.



సమీక్షిస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన

వేర్వేరు ఘటనల్లో ముగ్గురి మృతి

విజయనగరం జిల్లాలో వేర్వేరు ఘటనల్లో శుక్రవారం ముగ్గురు మృతిచెందారు.దీంతో ఆయా కుటుంబాల్లో విషాదం నెలకొంది.

రైలు ఢీకొని ఒకరు..



పోలీసు(ఫైల్)

బాడంగి: మండలంలో గొల్లాది గ్రామానికి చెందిన మన్నేల పోలీసు(48) రైలుఢీకొని మృతి చెందినట్లు రైల్వే హెచ్‌సీ ఈశ్వరరావు తెలిపారు. పొలం పనుల కోసం శుక్రవారం తెల్లవారుజామున నక్కలబంద వద్ద ఉన్న రైల్వేట్రాక్ దాటు తుండగా ఓ రైలు ఢీకొనడంతో పోలీసు అక్కడిక్కడే మృతిచెందినట్లు చెప్పారు. ఆయనకు భార్య అప్పమ్మ,ఇద్దరు కుమా ర్తెలు ఉన్నారని పేర్కొన్నారు. మృతదేహానికి బాడంగి పీహెచ్‌సీలో పోస్టుమార్టం నిర్వహించామని చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

జారిపడి మహిళ ..



సమాలమ్మ (ఫైల్)

గుర్ల: గుర్లలో ఓ మహిళ బిందెతో నీటిని తీసుకువస్తుండగా జారిపడడంతో మృతిచెందిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది.ఎస్ఐ భాస్కరరావుకథనం మేరకు.. గుర్ల గ్రామానికి చెందిన కమ్మిండి సమాలమ్మ (44) గ్రామంలో కొత్తగా నిర్మించిన ఇంటికి తాగునీటి కోసం వెళింది. నీటితో తిరిగి పాత ఇంటికి వస్తోంది. కొత్త ఇంటి ప్రాంతంలో మార్గం సరిగ్గా లేకపోవడంతో ఇసుకబస్తాల మీదుగా నెమ్మదిగా నడుస్తూ ముందుకు వెళ్తుండగా కాలుజారి నేలపై పడిపోయింది. తలకు ఇంటి అరుగుభాగం గట్టిగా తగలడంతో చికిత్సకోసం సమాలమ సోదరుడు రాము తదితరులు విజయనగరం తరలించారు. సమాలమ్మను పరిశీలించిన వైద్యులు మృతి చెందినట్లు ధ్రువీకరించారు. రాము ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ భాస్కరరావు కేసు నమోదు చేశారు.సమాలమ భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

పురుగు మందు తాగి యువకుడు..

దత్తిరాజేరు: పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఓ యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మానాపురం పోలీసుల కథనం మేరకు.. ఇంగిలాపల్లి గ్రామానికి చెందిన కోంద్రు చిన్నారావు(23) వ్యసనాలకు బానిసై, అప్పుల బాధ భరించలేక గత నెల 28వ తేదీన పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు చిన్నారావును వైజాగ్ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతుడి తల్లి రాము ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు మానాపురం పోలీసులు తెలిపారు.

చెక్‌బౌన్స్ కేసులో నిందితుడికి జైలు

పాలకొండ: చెక్‌బౌన్స్ కేసులో నిందితుడికి రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ.2 లక్షల జరిమానా విధిస్తూ స్థానిక సివిల్ జడ్జి కోర్టు న్యాయాధికారి ఎ.రాజ్ కుమార్ శుక్రవారం తీర్పుఇచ్చారు. వివరాలివీ... బూర్జ మండలం లచ్చయ్యపేటకు చెందిన గిరడ చిన్నారావు... అదే గ్రామానికి చెందిన బొడ్డుపాటి వెంకటరమణకు ఇవ్వాల్సిన మొత్తానికి గాను రూ.2 లక్షలకు చెక్ ఇచ్చారు. ఈ చెక్కు తీసుకొని వెంకటరమణ బ్యాంక్‌కు వెళ్లగాబౌన్స్ అయిందని సంబంధిత అధికారులు తెలిపారు.తనను చిన్నారావు మోసంచేశాడని ఆరోపిస్తూ న్యాయం చేయాలని కోరుతూ వెంకటరమణ కోర్టును ఆశ్రయించారు. దీనితో పాలకొండ కోర్టు జూనియర్ సివిల్ న్యాయాధికారి విచారణ జరిపారు. ఆరోపణలు రుజువు కావడంతో నిందితుడు చిన్నారావుకు జైలు, జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. వెంకటరమణకు నగదు ఇవ్వని పక్షంలో మరో మూడు నెలలు అదనంగా జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు.

మత్తు పదార్థాలు వినియోగిస్తే చర్యలు: సీఐ

రాజాం రూరల్: గంజాయి వంటి మత్తు పదార్థాలు వినియోగిస్తే చర్యలు తప్పవని రాజాంటౌన్ సీఐ దాడి మోహనరావు హెచ్చరించారు. గంజాయి సరఫరా చేసినా, వినియోగించినట్లు తెలిస్తేసమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారంఇచ్చిన వారి వివరాలను గోప్యంగాఉంచుతామని పేర్కొన్నారు.ఈ మేరకు రాజాం పట్టణంలోని బస్టాండ్, పార్కుతోపాటు పలుప్రదేశాలలో శుక్రవారం సిబ్బందితో కలిసి తనిఖీచేశారు. పలువురు అనుమానితులను ప్రశ్నించారు.

మైనర్లకు వాహనాలిస్తే సీజ్ చేస్తాం: ఎస్ఐ

విజయనగరం క్రైం: మైనర్లకు వాహనాలిసే యాజమానులపై కేసులు నమోదు చేసి సీజ్‌చేస్తామని విజయనగరం రూరల్ ఎస్ఐ వాసుదేవ్ హెచ్చరించారు. గురువారం రాత్రి రూరల్ పరిధిలోని వై జంక్షన్‌లో వాహనాలు తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనర్లు డ్రైవింగ్ చేస్తూ తనిఖీల్లో పట్టుబడుతుండడంతో తల్లిదండ్రులు కౌన్సెలింగ్‌చేస్తున్నామని తెలిపారు.

హైకోర్టు ఏజీపీగా సంకిలి న్యాయవాది



చిన్నాల ప్రవీణ్

రేగిడి:మండలంలోని సంకిలికి చెందిన న్యాయవాది చిన్నాల ప్రవీణ్ హైకోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా (ఏజీపీ)గా నియమితులయ్యారు. ఈమేరకు శుక్రవారంబాధ్యతలు స్వీకరించినట్లు ప్రవీణ్ ఒకప్రకటనలో తెలిపారు. ఇంజినీరింగ్ పూర్తిచేసిన ప్రవీణ్ శ్రీకాకుళం అంబేడ్కర్ వర్సిటీలో ఎల్ఎల్‌బీ పూర్తిచేశాడు. ఏడేళ్లుగా హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టిస్ చేస్తున్నాడు. ఆయన తండ్రి చిన్నాల పకీరునాయుడు రాజాం కోర్టులో లాయర్ ఉన్నారు. తల్లి చిన్నాల శారద సంకిలి మాజీ సర్పంచ్‌గా సేవలందించారు. కాగా రాష్ట్రంలో ఇటీవల 14 మంది ఏపీజీలను తొలిజాబితాలో నియమించింది. ప్రవీణ్ నియామకంపై రాజాం బార్ అసోసియేషన్ లాయర్లు, సంకిలివాసులు అభినందించారు.

ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేయాలి

విజయనగరం దాసన్నపేట: శిష్టకరణ సంక్షేమ సంఘం జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి, ఉపాధ్యక్షులు బగ్గం సుధాకర్ పట్నాయక్ ఏపీ ఉద్యోగుల సంఘం గజపతినగరం తాలుకా శాఖ అధ్యక్షుడిగా మూడోసారి ఎన్నికకావడంతో శిష్టకరణ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎంపీ గౌరీశ్వరరావు, రేగా సురేష్ శుక్రవారం ఒక ప్రకటనలో అభినందించారు.ఈ మేరకు సంఘ కార్యక్రమాలతో పాటు ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేయాలని కోరారు.

మహిళలపై లైంగిక వేధింపులను అరిట్టాలి

●పని ప్రదేశంలో లైంగిక వేధింపుల చట్టంపై కలెక్టర్ సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టరు అంబేద్కర్

కలెక్టరేట్: పని చేసే ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపులను పూర్తిగా అరికట్టాలని, వేధించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆదేశించారు. పని చేసే ప్రదేశంలో లైంగిక వేధింపుల చట్టం -2013 అమలుపై మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా అధికారులు, సిబ్బందితో కలెక్టరేట్ ఆడిటోరియంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడా మహిళలపై వేధింపులు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈచట్టం అమల్లోకి వచ్చి సుమారు 11 ఏళ్లు పూర్తయినా ఇంకా అవగాహన స్థాయిలోనే ఉండడం విచారకరమని అన్నారు. చట్టం వల్ల తమకు రక్షణ లభిస్తుందన్న విషయం మహిళలకు తెలియాలని... ఇది వారికి ధైర్యాన్ని ఇవ్వాలని సూచించారు. ప్రైవేటు కార్యాలయాల్లో కూడా చట్టాలు అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. దీని కోసం వివిధ కార్యాలయాల్లో ఏర్పాటైన కమిటీలు చురుగ్గా పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ చట్టం కింద కేసు నమోదు చేయడమే కాకుండా.. కఠినంగా శిక్ష పడినప్పుడే వేధింపులను నిరోధించవచ్చని కలెక్టర్ చెప్పారు. జేసీ కార్తీక్ మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలతో పాటు అసంఘటిత రంగంలో కూడా దీనిని అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ పర్తీన్, డీఆర్‌వో అనిత, ఐసీడీఎస్ పీడీ శాంతికుమారి, ఆర్‌డీవోలు సూర్యకళ, సాయి శ్రీ, శాంతి తదితరులు పాల్గొన్నారు.

నియామకం

పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధం, నిషేధ చట్టం -2013 జిల్లాలో పకడ్బందీగా అమలు కోసం నోడల్ అధికారులను నియమిస్తూ కలెక్టరు బీఆర్ అంబేద్కర్ ఉత్తర్వులు జారీ చేశారు. దీని ప్రకారం డివిజన్, మండల, మున్సిపల్ స్థాయిల్లో ఉద్యోగుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి జిల్లా స్థాయికి తెలిపేందుకు నోడల్ అధికారులను నియమించారు. మూడు డివిజన్ల అధికారులు, 27 మండలాల తహ సీల్దారులు, నలుగురు మున్సిపల్ కమిషనర్లను నోడల్ అధికారులుగా నియమించారు. వీరి పరిధిలో అందే ఫిర్యాదులను జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారికి నివేదించాలని ఆదేశించారు.

ఎమ్మెల్యేకు సమాచారం ఎందుకు ఇవ్వలేదు

● ప్రజావేదికలో నిలదీసిన వంగర మండల టీడీపీ నాయకులు

● శివ్వాం ఫీల్డ్ అసిస్టెంట్ సస్పెన్షన్



అధికారులను నిలదీస్తున్న టీడీపీ నాయకులు

వంగర: సామాజిక తనిఖీ ప్రజావేదికకు ఎమ్మెల్యే కోండ్రు మురళీ మోహన్‌కు సమాచారం ఇవ్వకుండా ఎందుకు గోప్యంగా నిర్వహించాల్సి వచ్చిందని టీడీపీ నాయకులు మోహనరావు, కృష్ణమూర్తితోపాటు నిలదీశారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవోకార్యాలయ ఆవరణలో డూమా పీడీ ఉమామహేశ్వరీ ఆధ్వర్యంలో సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వ హించారు.తొలుత ఎమ్మెల్యేను ఎందుకు పిలవలేదని టీడీపీ నాయకులు నిలదీశారు. గ్రామాల్లో జరిగిన అవకతవకలు బయటపడతాయని పిలవలేదా అని పీడీని ప్రశ్నించారు. దీంతో పీడీ ఏపీవోను పిలిచి ఎమ్మెల్యేను పిలవకపోవడానికి కారణంపై వివరణకోరి క్షమాపణ చెప్పారు. దీంతో టీడీపీ నాయకులు సమావేశం నిర్వహణకు అంగీకరించారు. తొలుత ఎస్ఆర్పీ ప్రసాద్ మాట్లాడుతూ 2023-24లో 30గ్రామాల్లో రూ.12,87,54,451 వినియోగంపై వారంరోజులు గ్రామాల్లో తనిఖీ జరిపినట్లు తెలిపారు. పలుగ్రామాల్లో కొలతలు, బినామీ మస్తర్లతో నిధులు దుర్వినియోగం చేసిన పలువురును గుర్తించినట్లు వివరించారు. తొలుత శివ్వాం గ్రామపరిధిలో 12 పనులకు రూ.20 లక్షలు వినియోగించగా బినామీ మస్తర్లు చాలా వరకు వేయడంతోపాటు దివ్యాంగులు, అంధులు, గ్రామ వలంటీర్లకు మస్తర్లు వేసి చాలావరకు నిధులు దుర్వినియోగం జరిగినట్లు సామాజిక బృందం చదివి వినిపించడంతో పీడీ ఫీల్డ్‌అసిస్టెంట్ జి.అప్పలనాయుడు సస్పెండ్‌కు ఆదేశాలు జారీ చేశారు. పటువర్ధనం,కొప్పర ఫీల్డ్‌అసిస్టెంట్లు కొలతలు తప్పువేయడంతోపాటుబినామీ మస్తర్లు వేయడాన్ని పీడీ తప్పుపట్టారు. పలు గ్రామాల్లో గృహ నిర్మాణాలకు సంబంధించి ఒక ఇంటికి రెండు బిల్లులు చెల్లించారని నిర్ధార ణకావడంతో మద్దివలస, నిలయ్యవలస, పటువర్ధనం చెందిన ఎఫ్ఏలకు రికవరీలకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సురేష్, ఎంపీడీవో సాల్మన్‌రాజ్, ఏపీడీ రామారావు, ఏపీఎం సత్యవతి, ఎస్ఆర్పీ, డీఆర్పీలు, టీడీపీ నాయకులు, పలువురు సర్పంచ్‌లు పాల్గొన్నారు.

సుసంపన్నమైన భారత్‌ను నిర్మించుకోవాలి

● అమిటీ యూనివర్సిటీ చాన్స్‌లర్ సెల్వమూర్తి



మాట్లాడుతున్న సెల్వమూర్తి

రాజాం/రూరల్:సుసంపన్నమైన భారత్ నిర్మాణంలో యువత భాగస్వామ్యులు కావాలని చత్తీస్‌ఘడ్‌లోని అమిటీ సైన్స్, టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్స్ ఫౌండేషన్ ప్రెసిడెంట్, అమిటీ యూనివర్శిటీ చాన్సలర్ డాక్టర్ డబ్ల్యూ సెల్వమూర్తిపిలుపునిచ్చారు.శుక్రవారం రాజాంలోని జీఎంఆర్ఐటీలో ఏవన్‌పవర్డ్ టెక్నాలజీఇంటిగ్రేషన్ ఫర్ సస్టైయనబులిటీపై రెండు రోజుల అంతర్జా తీయ సదస్సు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో భారత్ మూడో ఆర్థికవ్యవస్థగా అభివృద్ధి చెందుతుందని, ఐదు ట్రిలియన్ల జీడీ పీకి చేరుకుంటుందని తెలిపారు.రానున్నరోజుల్లో భారత్ అన్ని రంగాల్లో ప్రధానభూమిక పోషిస్తుందని తెలిపారు. పరిశోధన విభాగాధిపతి రవీంద్ర నాథ్ మాట్లాడుతూ సదస్సులోఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ అప్లికేషన్, రెన్యూవబుల్ ఎనర్జీ, సైన్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీపై, దేశ విదేశాల నుంచి సమర్పించనున్న 135 పరిశోధన పత్రాలపై చర్చించనున్నట్లు చెప్పారు. సదస్సులో కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్, సదస్సుకన్వీనర్ కె.జయశ్రీ, గిరీష్, లక్ష్మణమూర్తి, రాంబాబు, ప్రసాద్ పాల్గొన్నారు.

కౌలు రైతుల గుర్తింపునకు గ్రామసభలు



శృంగవరపుకోట రూరల్: మాట్లాడుతున్న ఏవో రవీంద్ర

శృంగవరపుకోట రూరల్: అర్హులైన రైతులకు ప్రభుత్వం నుంచి వ్యవసాయ పథకాలు పొందేందుకు కౌలురైతు గుర్తింపు కార్డులు ఉండాలని ఏవో రవీంద్ర తెలిపారు. శుక్రవారం మండలంలోని సంతగైరమ్మపేట, తిమిడి, కొత్తురు, ఉసిరి, చినఖండేపల్లి గ్రామాల్లో కౌలురైతు గుర్తింపు సదస్సులు నిర్వహించారు. కార్యక్రమంలో వీఏఏలు లోచేర్ల రవిచంద్ర, వివేక్, పుష్ప, శిరీష పాల్గొన్నారు.

● **లక్కవరపుకోట:**మండలంలోని రైతులంతా కౌలుదారుకార్డులు పొందాలని ఏవో ఎం.స్వాతీ తెలిపారు. రంగాపురం,గొల్జాం, కల్లెంపూడి, రంగరాయపురంల్లో రైతు సదస్సులు నిర్వహించారు.

● **రేగిడి:** కౌలు రైతుల గుర్తింపునకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఏవో గిరిడ మురళీకృష్ణ తెలిపారు. ఇప్పటి వరకు 17 గ్రామసభల్లో 55 మందిని గుర్తించినట్లు చెప్పారు.శుక్రవారం మండలంలోని మునకల వలస, పారంపేట, ఉణుకూరుల్లో కౌలు రైతుల గుర్తింపు గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కౌలురైతులకు 11నెలల కాలానికే భూమిపై హక్కు ఉంటుందని, దీనిపై రైతుల్లో ఎటువంటి అపోహలకు తావు ఉండకూడదని తెలిపారు.

ప్రోటోకాల్ పాటించాలి

●ఎంపీడీవోకు సర్పంచ్‌లు, ఎంపీటీసీల కుటుంబ సభ్యుల వినతి



ఎంపీడీవోతో మాట్లాడుతున్న సర్పంచ్‌ల కుటుంబ సభ్యులు

జామి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సర్పంచ్‌లకు అధికారులు విలువ ఇవ్వడంలేదని, వారికి ప్రోటోకాల్ విషయంలో ప్రాధాన్యం లేదని పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యుల కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో తిరుమలరావుకు పలు పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీలలోపాటు కొన్ని పంచాయతీల సర్పంచ్‌ల స్థానంలో వారు భర్తలు, కుమారులు వచ్చి ఎంపీడీవోకు ఫిర్యాదుచేయడం విశేషం. ప్రోటోకాల్ పాటించాలని, సచివాలయాలపై జగన్ బొమ్మలను తీయవద్దని కోరారు.

జగన్నాథపురంలో విద్యుత్ శాఖ భూమి కబ్జా

●నిర్ధారించిన అధికారులు



జగన్నాథపురంలో ఆక్రమిత స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

బొబ్బిలి: జగన్నాథపురం గ్రామంలో విద్యుత్ సబ్‌స్టేషన్‌కు చెందిన లక్షలాది రూపాయల విలువ చేసే ఆరుసెంట్ల భూమి కబ్జాకు గురైంది. సర్వే శాఖ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ రవిశంకర్, విద్యుత్ డీఈ సత్యనారాయణ, ఏడీఈ శ్రీనివాసరావు, ఏఈ సాంబశివరావు తదితరులు శుక్రవారం పరిశీలించారు. సర్వే నెంబరు 56లో 46సెంట్ల భూమిని రెవెన్యూశాఖ అధికారికంగా విద్యుత్ శాఖకు కేటాయించింది. ఇందులో కొంతభూమిని ఆక్రమించుకొని అక్రమ నిర్మా ణాలు సాగిస్తున్నారని చాలా కాలంగా ఫిర్యాదులు వెళుతున్నా పట్టించుకోని అధికారులు శుక్రవారం పరిశీలించారు.ఈ భూమి విద్యుత్ శాఖకే చెందుతుం దని నిర్ధారించారు.ఇక్కడసబ్‌స్టేషన్‌ను ఆనుకొని కబుష్టాపురం, జగన్నాథపురం గ్రామాల పంట పొలాలకు భైరిసాగరం చెరువునుంచి పంట కాలువఉంది. ఈ కాలువను మళ్లించి అక్రమార్కులు కబ్జాకు పాల్పడ్డారు. నిర్మాణ పనులు చేపట్టారు. ఆలస్యంగానైనా స్పందించిన అధికారులు ఎట్టకేలకు కబ్జాకు గురైన స్థలం విద్యుత్ శాఖదేనని గుర్తించడం గమనార్హం.

దాడి ఘటనపై డీఎస్పీ దర్యాప్తు



పిరిడిలో దర్యాప్తు చేస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

బొబ్బిలి: పిరిడి గ్రామంలో వెలగాడ రవితేజ అనే యువకునిపై కొంతమంది వ్యక్తులు దాడి చేసి కులం పేరుతో దూషించారని ఇచ్చిన ఫిర్యాదుపై బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీనివాసరావు శుక్రవారం దర్యాప్తు చేశారు. ఈ నెల 1న గ్రామానికి చెందిన ఏడుగురు వ్యక్తులు దాడి చేసి గాయపరిచారని, కులం పేరుతో దూషించి భయ భ్రాంతులకు గురిచేశారని రవితేజ ఇచ్చిన ఫిర్యాదుపై బాధ్యులైన వారం దరినీ డీఎస్పీ విచారించారు. ఆయన వెంట సీఐ నాగేశ్వరరావు, సిబ్బంది ఉన్నారు.

ఎస్.కోట ఈవోగా అనూరాధ

శృంగవరపుకోట: శృంగవరపుకోట మేజర్ పంచాయతీ కార్యదర్శిగా వీవీ అనూరాధను నియమించారు.ఈమేరకు ఉత్తర్వులు జారీఅయినట్లు ఎంపీడీఓ సాంబశివరావు తెలిపారు. విజయనగరం మండలం కొండకరకాం పంచాయితీ కార్యదర్శిగా పని చేసిన ఆమెకు గ్రేడ్-1 పంచాయితీ కార్యదర్శిగా పదోన్నతి లభించింది. ఏడాది కాలంగా మేజర్ పంచాయతీ ఇన్‌చార్జి పాలనలోఉంది. కొత్తవలస ఈవో కన్నబాబు ఇన్‌చార్జి విధులు నిర్వహించారు.అతనికి కూడా గ్రేడ్-1పదోన్నతి రావ డంతో రాజాంమండలం పొగిరిపంచాయతీ కార్యదర్శిగా నియమితులైనట్టు సమాచారం.

పెట్రోల్ బంకుల్లో తనిఖీ

విజయనగరం రింగురోడ్డు: విజయనగరంలోని పలు పెట్రోల్ బంకుల్లో సీఎస్‌డీటీలు బృందం తనిఖీలు చేపట్టింది. ఈ నెల నాలుగో తేదీన బంకుల్లో సౌకర్యాలు పట్టవా? శీర్షికతో కథనం ఆంధ్రజ్యోతిలో ప్రచురితంకావడంతో పౌరసరఫరాల అధికారులు స్పందించారు.పౌరసరఫరాల శాఖ జిల్లాశాఖాధికారి మధుసూదనరావుఆదేశాలతో సీఎస్‌డీటీలు బృందంగా పెట్రోల్ బంకుల్లో తనిఖీలు చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న పలుబంకులపై కేసులు నమోదుచేశారు. ఈ సందర్భంగా పౌరసరఫరాల శాఖాధికారి మధుసూదనరావు మాట్లాడుతూ బంకుల్లో మరుగుదొడ్లు, తాగునీరు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు,వాహనాలకు ఉచితంగా గాలి నింపే యంత్రాలను అందుబాటులో ఉంచాలని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే, చర్యలు తప్పవని హెచ్చరించారు. బంకుల్లో సమస్యలు వుంటే వినియోగ దారులు 99492 19242 నెంబరుకు ఫిర్యాదు చేయాలని చెప్పారు.

అగ్నివీర్ నోటిఫికేషన్ విడుదల

కలెక్టరేట్: అగ్నిపథ్ పథకంలో భాగంగా భారతీయ వాయుసేనలో అగ్నివీర్(వాయు) నియామకాలకోసం కమాండింగ్ ఆఫీసర్, ఎయిర్‌మెన్ సెంటర్ సికింద్రాబాద్ నుంచి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు జిల్లా ఉపాధి అధికారి డి.అరుణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్ ఎంపీసీలో లేదా పాలిటెక్నిక్ లేదా ఇంటర్ ఒకేషనల్‌లో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు దరఖాస్తు చేసేందుకు అర్హులని తెలిపారు.ఇంగ్లీష్ సబ్జెక్టులో అభ్యర్థులు 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధిం చాలని పేర్కొన్నారు. అభ్యర్థులు 2004 జూలై 3 తేదీ నుంచి 2008 జనవరి 3 తేదీ మధ్య జన్మించిన వారై ఉండాలని తెలిపారు. అగ్నివీర్ (వాయు)లో నియామకం కోసం స్త్రీ, పురుషులు అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హులైన అభ్యర్థులు ఈనెల ఎనిమిదో తేదీ నుంచి 28 తేదీ లోగా వెబ్ సైట్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలని సూచించారు. అభ్యర్థుల ఎంపిక కోసం ఆన్‌లైన్ పరీక్ష అక్టోబరు 18న జరుగుతుందని పేర్కొన్నారు. అభ్యర్థులు దరఖాస్తుతోపాటు 550 పరీక్ష రుసుము, దీనికి అదనంగా జీఎస్టీ చార్జీలు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

నేడు మొబైల్ ఏటీఎం ప్రారంభం

విజయనగరంరూరల్:స్థానిక డీసీసీబీ కార్యాలయం వద్ద మొబైల్‌ఏటీఎంను మంత్రి కొండపల్లిశ్రీనివాస్, ఎమ్మెల్యే, అదితిగజపతిరాజు శనివారం ప్రారంభిస్తారని డీసీసీబీ ఇన్‌చార్జి సీఈవో ఉమామహేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు.అంతర్జాతీయ సహకారదినోత్సవం పురస్కరించుకునిపతాకాన్ని జేసీ కార్తీక్ ఆవిష్కరిస్తారని పేర్కొన్నారు.

టోల్ వసూళ్లకు ఉత్తర్వులు

విజయనగరం(ఆంధ్రజ్యోతి): గంట్యాడ మండలంలోని జాతీయరహదారి-516 (ఈ) పరిధిలో టోల్ ప్లాజా వద్ద రుసుము వసూల్ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు శుక్రవారం జాతీయ రహదారులు మంత్రిత్వశాఖ ఉత్తర్వులు విడుదలచేసింది. ఇక్కడ ఏర్పాటుచేసిన టోల్‌ప్లాజా వద్ద వివిధ రకాల వాహనాలకు ఎంత రుసుము వసూల్‌చేయాలో ఆ జీవో స్పష్టత ఇచ్చారు. కార్లు, జీపులు, వ్యాన్లు వంటి లైట్‌మోటారు వాహనాలకు ప్రతి కిలోమీటరుకు రూ .0.65 పైసలు చొప్పున వసూలు చేయనున్నట్లు ఆదేశాల్లో పేర్కొన్నారు. లైట్ కమర్షియల్, లైట్‌గూడ్స్ వాహనాలు, మినీబస్సులకు రూ.1.05, బస్సు, ట్రక్ (రెండుయాక్సిల్స్), మూడు యాక్సిల్ కమర్షియల్ వాహనాలకు ప్రతి కిలోమీటరుకు రూ. 2.40, హెవీ కనస్ట్రక్షన్ మిషనరీ, ఎర్త్‌మూవింగ్ ఎక్విప్‌మెంట్, మల్టీ యాక్సిల్ వాహనాలకు రూ.3.45, భారీ ఓవర్ సైజ్ ఏడు ఆపైన యాక్సిల్స్ ఉన్నవాటికి రూ. 4.20 వసూల్ చేయనున్నట్లు ఆదేశాల్లో పేర్కొన్నారు. 2007, 2008లో నిర్ధారించిన ప్రకారం టోల్‌ప్లాజా వద్ద వసూల్ చేయనున్నారు.

రాజధాని కోసం నెల జీతం

● చంద్రబాబుకు అందజేసిన ఎంపీ కలిశెట్టి



సీఎంకు చెక్కు అందిస్తున్న కలిశెట్టి

విజయనగరం (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని నిర్మాణానికి విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు నెల జీతాన్ని సీఎం చంద్రబాబుకు అందించారు. ఎంపీగా తనకువచ్చిన మొదటి నెల జీతం, అలవెన్స్ లను అమరావతి నిర్మాణానికి వినియోగించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు పలువురు ఎంపీల సమక్షంలో రూ 1.57 లక్షల జీతానికి సం బంధించిన చెక్కును ఢిల్లీలో శుక్రవా రం అందచేశారు. ఈ సందర్భంగా కలిశెట్టి మాట్లాడుతూ ఇటీవల తిరుమలలో వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్న అనంతరం అక్కడ తీసుకున్న మేరకు తన నెలజీతం, అలవెన్స్‌లు సీఎంకు అందచేసినట్లు తెలిపారు.

నేడు ఎంపీ కలిశెట్టి రాక

విజయనగరం రూరల్:ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ప్రమాణం చేసిన తర్వాత తొలిసారిగా శనివారం విజయనగరం వస్తున్నారు. ఉదయం 10 గంటలకు విశాఖ విమానాశ్రయం నుంచిమద్దిలపాలెం, ఇసుకతోట, రాజాపులోవ జంక్షన్ మీదుగా విజయనగరం చేరుకోనున్నా రు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

బాడంగి: బాడంగి సీహెచ్‌సీని ఎమ్మెల్యే బేబీనాయన శనివారం పరిశీలిస్తారని టీడీపీ మండలాధ్యక్షుడు తెంటు రవిబాబు తెలిపారు. హాస్పిటల్ సలహా సంఘం సమావేశా నికి హాజరువుతారని పేర్కొన్నారు.

సీహెచ్‌సీల్లో మందులు ఉన్నాయి

● మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

సాలూరు: గత నెలలో జిల్లాలో ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి పీహెచ్‌సీల్లో అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచామని రాష్ట్ర మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. సీజనల్ వ్యాధులపై వైద్యాధికారులతో శుక్రవారం ఫోన్‌లో ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత నెల నుంచే అన్ని సీహెచ్‌సీల్లో మందులు అందుబాటులో ఉన్నాయని అన్నారు. గిరిజన ప్రాంతంలో ఉన్న అన్ని పీహెచ్‌సీలకు మలేరియా మందులు అందుబాటులో ఉండేలా కలెక్టర్ డీఎంఅండ్‌హెచ్‌ఓలకు గత నెల 27న ఆదేశాలు ఇచ్చినట్టు తెలిపారు. జ్వరాలు ఎక్కువగా ఉన్నచోట వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని వైద్యాధికారులను ఆదేశించారు. పాఠశాలలు, వసతి గృహాలలో చదువుతున్న విద్యార్థులకు వేడి నీరు ఇవ్వాలని... ఏ చిన్న ఆరోగ్య సమస్య వచ్చినా వెంటనే సిబ్బందికి తెలియజేయాలని సూచించారు. వసతి గృహాల కోసం ప్రత్యేకించి వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని మంత్రి సంధ్యారాణి ఆదేశించారు.

విద్యార్థులను బలవంతంగా తరలించవద్దు

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: జీపీఎస్ (ఏకోపాధ్యాయ) పాఠశాలల్లోని 3, 4, 5 తరగతుల విద్యార్థులను ఆశ్రమ పాఠశాలలకు బలవంతంగా తరలించడాన్ని మానుకోవాలని యూటీఎఫ్ గిరిజన సంఘ నాయకులు అధికారులను డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యా హక్కు చట్టం ప్రకారం విద్యార్థి తనకు నచ్చిన స్కూల్‌లో చదువుకోవడానికి అవకాశం ఉందన్నారు. గిరిజన సంక్షేమ అధికారులు తల్లిదండ్రులను బలవంతంగా ఒప్పించి సమావేశాలు పెట్టి తరలిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ఈ నిర్ణయాన్ని విరమించకపోతే గిరిజనులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామన్నారు. ప్రకటన విడుదల చేసిన వారిలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మురళీమోహన్‌రావు, జిల్లా అధ్యక్షుడు టి.రమేష్, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కె.అవినాష్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాజు, పండు ఉన్నారు.

రథయాత్రకు ఏర్పాట్లు

వీరఘట్టం: మండల కేంద్రంలో శ్రీజగన్నాథస్వామి రథోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా రథానికి రంగులు వేసి సిద్ధం చేశారు. శనివారం స్వామివారి శ్రీచక్ర ప్రతిష్ఠ నిర్వహిస్తామని, ఆదివారం రథయాత్ర (తొలిదశమి) నిర్వహిస్తామని ఆలయ ప్రధాన అర్చకుడు లింగరాజు ప్రసాద్‌రథో తెలిపారు.



సిద్ధమైన రథం

భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు



ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న అధికారులు

పాలకొండ: ఈనెల 7వ తేదీ నుంచి జరగబోవు జగన్నాథస్వామి రథయాత్ర సందర్భంగా ఏర్పాట్లులో భాగంగా లైట్స్, టాయిలెట్స్, రథం వెళ్లే మార్గాన్ని టీడీపీ పట్టణ అధ్యక్షుడు గంటా సంతోష్‌కుమార్, ఆలయ ఈవో సర్వేశ్వరరావు శుక్రవారం పరిశీలించారు. భక్తులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా చర్యలు చేపట్టాలన్నారు. వీరి వెంట ఆలయ సిబ్బంది, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌కు మోక్షం



సీసీ రోడ్డుగా మారిన ఆర్టీసీ బస్టాండ్ ఫ్లాట్‌ఫారం

గుమ్మలక్ష్మీపురం: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఎట్టకేలకు మరమ్మతులకు నోచుకుంటోంది. ఈ బస్టాండ్‌లో కనీస సౌకర్యాలు లేవని గతంలో ప్రయాణికుల నుంచి ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో బస్టాండ్ భవనాన్ని మరమ్మతులు చేసి రంగులు వేశారు. గతుకులమయంగా ఉన్న బస్టాండ్ ఫ్లాట్‌ఫారాన్ని సీసీ రోడ్డుగా మార్చారు. ఈ పనులు ప్రారంభం కావడంతో ప్రయాణికులు, గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్‌గా మణికృష్ణ

పాలకొండ: పాలకొండ పట్టణానికి చెందిన కె.మణికృష్ణ ఏపీపీఎస్సీ పరీక్షల్లో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్‌గా జోన్-1కి ఎంపికయ్యారు. ఆయన తండ్రి కె.జనార్దన గురూజీ తలవరం ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. తల్లి గృహిణి. సోదరి నూజివీడు ట్రిపుల్ ఐటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. మణికృష్ణ మాట్లాడుతూ తన తల్లిదండ్రుల ప్రేరణతో ఈ స్థాయికి వచ్చానన్నారు. మణికృష్ణకు కుటుంబ సభ్యులు, బంధువులు, తలవరం ఉపాధ్యాయులు, విద్యాశాఖాధికారులు, ఏపీజీఈఏ కార్యదర్శి భరత్ భూషణ్, గ్రంథాలయాధికారి బి.గణేష్‌బాబు శుక్రవారం అభినందనలు తెలిపారు.



మణికృష్ణను అభినందిస్తున్న తల్లిదండ్రులు

ప్రభుత్వ కార్యకలాపాలన్నీ ఇకపై మాతృభాషలోనే

ఒడిశా

రాయగడ: ఇక నుంచి ప్రభుత్వపరమైన అధికారిక వ్యవహారాలన్నీ మాతృభాషలోనే అమలు చేయాలని తనకు ఏ పత్రాలు పంపించినా అన్నీ ఒడియాలోనే ఉండాలని ముఖ్యమంత్రి మోహన్ మాఝి ఆదేశించారు. ఆయన శుక్రవారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఒడియా భాష సంస్కృతికి పెద్దపీట వేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. అవసరమైతే చట్టసవరణలు చేస్తామని చెప్పారు.

107 కిలోల గంజాయి స్వాధీనం

రాయగడ: ఓ కారులో గంజాయిని తరలిస్తున్న నిందితుడిని పద్మాపూర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీనికి సంబంధించి జిల్లా పోలీసుల కార్యాలయం తెలిపిన వివరాల ప్రకారం.. పద్మాపూర్ పోలీసుస్టేషన్ పరిధి మెరండా గ్రామానికి చెందిన శరత్‌జగరంగా అనే యువకుడు తన కారులో గంజాయి తరలిస్తుండగా ఇందుపూర్ గ్రామం వద్ద పద్మాపూర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి నుంచి నాలుగు ప్లాస్టిక్ సంచుల్లో ఉన్న 107కిలోల 500 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఒక సెల్‌ఫోన్, కారు, నిందితుడి ఆధార్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డు స్వాధీనం చేసుకుని, నిందితుడిని కోర్టుకు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



గంజాయితో పట్టుబడ్డ నిందితుడు

నాణ్యతా లోపం — నెల రోజులకే ఇలా..

● పెచ్చులూడుతున్న డివైడర్ ● కొరవడిన నాణ్యతా ప్రమాణాలు



పెచ్చులూడుతున్న డివైడర్

వీరఘట్టం: వీరఘట్టం ప్రధాన రహదారిలో రూ.5.5 కోట్ల అంచనా వ్యయంతో పనులు చేపడుతున్నారు. పనుల్లో భాగంగా రహదారి మధ్యలో డివైడర్లు ఏర్పాటు చేశారు. అయితే నెల రోజుల వ్యవధిలోనే డివైడర్ పెచ్చులూడుతోంది. కాంట్రాక్టర్ నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లే ఇలా జరిగిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి డివైడర్ల ఏర్పాటులో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చూడాలని కోరుతున్నారు.

● ఈ విషయమై ఆర్అండ్‌బీ జేఈ జగన్మోహన్‌రాజు వద్ద ప్రస్తావించగా పరిశీలించి మరమ్మతులు చేయిస్తామని తెలిపారు.

అధ్వానం — రోగాలు రావా మరి..

● బహిర్భూమిగా పీఆర్‌రాజుపేటకు వెళ్లే రహదారి



అధ్వానంగా వెలగవాడ నుంచి పీఆర్‌రాజుపేట వెళ్లే రహదారి

పాలకొండ: గ్రామాల్లో పరిశుభ్రత లేకపోవడంతో మలేరియా, డెంగ్యూ, అతిసారం వంటి వ్యాధులు సోకి అనారోగ్యానికి గురవుతున్నారని, స్వచ్ఛభారత్ జాడ లేదని అభ్యుదయ రైతు ఖండాపు ప్రసాదరావు విమర్శించారు. ఇటీవల సచివాలయ కార్యదర్శులతో సమావేశం నిర్వహించి గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని సూచించినా ఫలితం లేదన్నారు. వెలగవాడ సచివాలయం నుంచి పీఆర్‌రాజుపేటకు వెళ్లే రహదారికి ఇరువైపులా బహిర్భూమిగా వినియోగించడంపై ఎంపీడీవోకు విన్నవించినా ఫలితం లేదని తెలిపారు. ఇప్పటికైనా పారిశుధ్యాన్ని మెరుగు పరచాలని ఆయనతో పాటు స్థానికులు కోరుతున్నారు.

నిర్లక్ష్యం — దోనిపై దృష్టి సారించరూ..

● పిచ్చిమొక్కలు తొలగించని వైనం ● సాగునీటికి ఆటంకం



ఉల్లిభద్ర సమీపంలోని దోనిలో ఉన్న పిచ్చిమొక్కలు

గరుగుబిల్లి: తోటపల్లి ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువపై నిర్మించిన దోనిపై దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో కొంకడివరం, సీతారాంపురంలకు ఆనుకుని ఉన్న జంఝావతి కాలువ నుంచి ఉల్లిభద్రతో పాటు దిగువ ప్రాంతాలకు సాగునీటి సరఫరాకు అవసరమైన దోని నిర్మించారు. గత ఐదేళ్లుగా దీనివైపు అధికారులు దృష్టి సారించలేదు. ప్రస్తుతం ఖరీఫ్‌కు రైతులు సన్నద్ధమవుతున్న సమయంలో సాగునీరుకు ఆటంకం కలగకుండా ఉపయోగంలోకి తీసుకువచ్చే విధంగా దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు.

ఇది ప్రజా విజయం

● ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ● ఘనంగా విజయోత్సవ ర్యాలీ

కురుపాం: కురుపాంలో శుక్రవారం టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి విజయోత్సవ ర్యాలీ ఘనంగా నిర్వహించారు. స్థానిక ధూళికేశ్వరస్వామి ఆలయం నుంచి షిరిడీ సాయిబాబా ఆలయం వరకు డప్పు వాయిద్యాలతో ఘనంగా ఊరేగించారు. అనంతరం కుప్పిలి సీతయ్యమ్మ లేఅవుట్‌లో అభినందన సభ నిర్వహించారు. ఐదు మండలాల టీడీపీ నాయకులు పాల్గొన్నారు. నియోజకవర్గంలో సమస్యలు పరిష్కారించాలని ఎమ్మెల్యేను కోరారు. నియోజకవర్గంలో టీడీపీ గెలుపులో వీరేష్ చంద్రదేవ్ కీలక పాత్ర పోషించారని కొనియాడారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గం అభివృద్ధికి ఎమ్మెల్యే జగదీశ్వరి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే జగదీశ్వరి మాట్లాడుతూ ఇది ప్రజా విజయం.. ప్రజలతో మమేకమై అభివృద్ధి పరుగులు పెట్టిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కార్యనిర్వహణ కార్యదర్శి దత్తి లక్ష్మణరావు, టీడీపీ అరకు పార్లమెంట్ కార్యదర్శి డొంకాడ రామకృష్ణ, తెలుగు యువత అధికార ప్రతినిధి కోలా రంజిత్‌కుమార్, ఎంపీ బొంగు సురేష్, టీడీపీ మండల కన్వీనర్లు కొండయ్య, పాడి సుధ, రాంబాబు, శేఖర్ పాత్రుడు, అక్కెన మధు, జనసేన నియోజకవర్గం ఇన్‌చార్జి కద్రుక మల్లేష్, వంశీ, కూటమి నాయకులు పాల్గొన్నారు. అనంతరం విందు ఏర్పాటు చేశారు.



అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

జగదీశ్వరికి ఘన సన్మానం

గరుగుబిల్లి: కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరికి మండలానికి చెందిన టీడీపీ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. కురుపాంలో శుక్రవారం నిర్వహించిన అభినందన సభలో పార్టీ ప్రతినిధులు ఎం.పురుషోత్తంనాయుడు, అక్కేన మధుసూదనరావు, అంబటి రాంబాబు, ద్వారపురెడ్డి సత్యనారాయణ, ఎంబీ విజయవాంకుశం, కోట భరత్‌కుమార్, ఎం.సింహాచలంనాయుడు, వై.శ్రీనివాసరావుతో పాటు పలువురు ఆమెను దుశ్శాలువాతో సన్మానించారు.

ముఖ్యమంత్రి దృష్టికి సమస్యలు

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: దేశ రాజధాని ఢిల్లీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర నియోజకవర్గంలోని సమస్యలను శుక్రవారం వివరించారు. నియోజకవర్గంలో యువతకు ఉపాధి కల్పించాల్సిన అవసరాన్ని ముఖ్యమంత్రికి ఆయన వివరించారు. ఢిల్లీలో ఉన్న విజయచంద్ర.. ముఖ్యమంత్రికి నియోజకవర్గం సమస్యలపై వివరించడంతో పాటు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తదితరులను వ్యక్తిగతంగా కలసి సంబంధిత శాఖల ద్వారా సాయం అందించాలని కోరారు.



ఢిల్లీలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి సమస్యలపై వివరిస్తున్న విజయచంద్ర

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

గరుగుబిల్లి: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎంఈవో కె.కొండలరావు సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల ఆధ్వర్యంలో శుక్రవారం పలు రకాల మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పాఠశాల ఆవరణలో అవసరమైన మొక్కలు నాటేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం చెట్ల సంఖ్య తగ్గడంతో పర్యావరణానికి ముప్పు సంభవించే పరిస్థితి ఉందన్నారు. చిన్నారులు వలే చెట్లను సంరక్షించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంలు మాలతి, శివకృష్ణ, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.



గరుగుబిల్లి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న దృశ్యం

సాగునీటి కాలువలో పిచ్చిమొక్కల తొలగింపు



గొట్టివలసలో జంఝావతి కాలువలో పిచ్చి మొక్కలను తొలగిస్తున్న ఉపాధి వేతనదారులు

గరుగుబిల్లి: మండలంలోని సాగునీటి కాలువల ఆధునికీకరణకు ఉపాధి హామీ నిధులతో చర్యలు చేపడుతున్నారు. గత కొన్నేళ్లుగా జంఝావతి కాలువల పరిధిలోని పిచ్చి మొక్కలు, పూడికలు తొలగించని పరిస్థితి ఏర్పడింది. ఖరీఫ్ సమయంలో కాలువలు సాగునీరందించని పరిస్థితి నెలకొంది. దీంతో ఉపాధి పథకంలో పనులు చేపడుతున్నారు. పూర్తిస్థాయిలో పిచ్చి మొక్కలు, పూడికలు తొలగిస్తే రైతులకు ఖరీఫ్ కష్టాలు తప్పుతాయి.

విద్యార్థులకు కిట్లు పంపిణీ

బలిజిపేట (సీతానగరం): బలిజిపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఎంఈవో సామల సింహాచలం చేతులమీదుగా శుక్రవారం విద్యార్థులకు కిట్లు పంపిణీ చేశారు. హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రకృతి పద్ధతులతోనే అధిక దిగుబడులు



లఖనాపురంలో ప్రకృతి సాగు పంటలను పరిశీలిస్తున్న రాజారావు

గరుగుబిల్లి: ప్రకృతి వ్యవసాయ పద్ధతులతోనే అధిక దిగుబడులు సాధ్యమవుతాయని రైతు సాధికారిక ప్రతినిధి ఎస్.రాజారావు అన్నారు. శుక్రవారం ఖడ్గవలస, లఖనాపురం గ్రామాల్లో నవధాన్యాల సాగును ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నవధాన్యాల సాగుతో భూమి సారవంతం అవుతుందన్నారు. రైతులు విధిగా 20 నుంచి 30 రకాల విత్తనాలను వేసుకోవడంతో బహుళ ప్రయోజనాలు కలుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఏ జి.అన్నపూర్ణ, దేవీప్రసాద్, రైతులు సత్యనారాయణ, శరత్, పోలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత సిలిండర్ల కోసం..



ఈకేవైసీ కోసం జీసీసీ వద్ద బారులు తీరిన గిరిజనులు

ఉచిత గ్యాస్ సిలిండర్లు పొందడానికి ఈకేవైసీ తప్పనిసరి అని ప్రచారం జరగడంతో మారుమూల గిరిజన గ్రామాలకు చెందిన ప్రజలు శుక్రవారం గుమ్మలక్ష్మీపురం జీసీసీ వద్దకు భారీగా తరలివచ్చారు. గంటల కొద్దీ ఎండలోనే నిరీక్షించారు. ఈకేవైసీకి సమయం ఉందని, అందరూ రావాల్సిన అవసరం లేదని సంబంధిత అధికారులు చెబుతున్నా వారు వినడం లేదు. నిత్యం వందలాదిగా గిరిజన ప్రజలు జీసీసీ వద్దకు వచ్చి.. బారులుదీరుతున్నారు. దీనిపై జీసీసీ మేనేజర్ కృష్ణ ప్రసాద్‌ను వివరణ కోరగా.. గ్యాస్ సిలిండర్ కనెక్షన్ ఉన్న వారు బ్యాంకు ఖాతాను ఆధార్‌కార్డుతో అనుసంధానం చేసుకోవాలని తెలిపారు. ఈకేవైసీకి నిర్ణీత గడువు లేదన్నారు.

- గుమ్మలక్ష్మీపురం

నాణ్యమైన ఆహారాన్ని అందించాలి

గరుగుబిల్లి: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని నాగూరు ఎంపీటీసీ సభ్యులు ద్వారపురెడ్డి సత్యనారాయణ సూచించారు. శుక్రవారం చిలకాం పరిధిలోని పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. గతంలో అమలు చేస్తున్న మెనూలో కొంతమేర లోపాలు ఉన్నాయని, విద్యార్థులకు సౌకర్యంగా ఉండే వాటిని అందిస్తే వృథా అయ్యే పరిస్థితి ఉండదని చెప్పారు. ఈ పరిశీలనలో హెచ్ఎం మర్రాపు మహేష్, కె.రామ్‌మోహనరావు ఉన్నారు.



చిలకాంలో మధ్యాహ్న భోజన పథకం వంటలను రుచి చూస్తున్న సత్యనారాయణ

విద్యార్థులకు వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారిణి హిమబిందు

సాలూరు రూరల్: ఖరాసవలస కేజీబీవీ పాఠశాలలో శుక్రవారం మామిడిపల్లి వైద్యసిబ్బంది వైద్యశిబిరం నిర్వహించారు. పాఠశాలలో 216 మంది విద్యార్థులకు వైద్యాధికారిణి హిమబిందు వైద్యపరీక్షలు చేశారు. ఇద్దరికి జ్వరం ఉండడంతో చికిత్స చేశారు. ఈ కార్యక్రమంలో ఈవో తిరుపతిరావు, వైద్య సిబ్బంది సాయి, మురళి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లోనే చిన్నారులకు మానసిక వికాసం



మాట్లాడుతున్న సీడీపీవో ప్రసన్న

నెల్లిమర్ల: అంగన్‌వాడీ కేంద్రాలతోనే చిన్నారులకు మానసిక వికాసం కలుగుతుందని సీడీపీవో ప్రసన్న అన్నారు. శుక్రవారం కొత్తపేట అంగన్‌వాడీ కేంద్రంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ 3 సంవత్సరాలు వయసు నిండిన ప్రతి చిన్నారిని అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పాలని తల్లిదండ్రులకు సూచించారు. ఈ కేంద్రాల్లో చిన్నారులకు విద్యతో పాటు ఆటపాటలు, మానసిక అభివృద్ధి ఉంటాయని చెప్పారు. మంచి పౌష్టికాహారాన్ని కూడా అందజేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి గురాన చక్రి, ఎంపీటీసీ మిరప శాంతకుమారి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జ్యోతి, అంగన్‌వాడీ కార్యకర్త లక్ష్మి పాల్గొన్నారు.

క్లుప్తంగా..

దయానిధిపురం పొలాల పరిశీలన

సీతానగరం: జయంతి రాయవరం రెవెన్యూ పరిధిలోని దయానిధిపురం గ్రామంలోని పొలాలను వీఆర్వో శ్రీనివాసరావు శుక్రవారం పరిశీలించారు. ప్రతి ఏటా వర్షా కాలంలో తమ పంట పొలాలు ముంపునకు గురవుతున్నాయని, తగిన చర్యలు తీసుకోవాలని ఓ రైతు సర్పంచ్ రామారావుతో పాటు వీఆర్వోకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వీఆర్వో ఆ పొలాలను పరిశీలించారు. గాదెలవలస గ్రామంలో చేపల చెరువులు ఉండడం వల్ల పైనుంచి వచ్చిన వర్షపునీరు కిందకు వెళ్లడానికి మార్గం లేక, పంట పొలాల్లో రావడంతో పొలాలన్నీ ముంపునకు గురవుతున్నాయని రైతు వివరించారు. దీనిపై చేపల చెరువు యజమానితో మాట్లాడి, పై అధికారులకు తెలియజేస్తానని వీఆర్వో భరోసా ఇచ్చారు. ఆయన వెంట సర్వేయర్, పంచాయతీ కార్యదర్శి ఉన్నారు.

పారిశుధ్య పనులు చేపట్టండి

బలిజిపేట(సీతానగరం): వర్షా కాలం నేపథ్యంలో గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని ఎంపీడీవో రమేష్‌నాయుడు సూచించారు. శుక్రవారం బలిజిపేట మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, వర్షా కాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున పారిశుధ్య పనులు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఈవోపీఆర్డీ పాల్గొన్నారు.

'ప్రైవేట్' ఇంటిలో పాఠశాల నిర్వహణ దారుణం

సాలూరు రూరల్: సాలూరు మండలం గంగన్నదొరవలస మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఓ వ్యక్తి ఇంటిలో నిర్వహించడం దారుణమని, భవన నిర్మాణాలు పూర్తి చేయకుంటే ఆందోళన చేస్తామని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు చెప్పారు. తమ సంఘనేతలతో కలసి గంగన్నదొర పాఠశాలలోని అసంపూర్తి నిర్మాణాలను పరిశీలించారు. ప్రభుత్వం స్పందించి భవన నిర్మాణాలు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘ నేతలు జన్ని ఈశ్వరరావు, వంతల సుందరరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీహెచ్‌డబ్ల్యూలకు జీతాలు చెల్లించాలి

గుమ్మలక్ష్మీపురం: గిరిజన ప్రాంతంలో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు జీతాలు చెల్లించాలని ఏపీ గిరిజన సంఘం నాయకుడు కోలక అవినాష్ డిమాండ్ చేశారు. ఆయన శుక్రవారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. సీహెచ్‌డబ్ల్యూలకు గత ఐదు నెలలుగా జీతాలు చెల్లించలేదని, ఈ కొత్త ప్రభుత్వంలోనైనా జీతాలు చెల్లించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అరకొర జీతాలతో బతుకులు ఈడుస్తున్న వీరికి జీతాలు చెల్లించపోతే బతుకు దయనీయంగా మారుతుందన్నారు. వెంటనే జీతాలు చెల్లించాలని ఆయన కోరారు.

నెంబర్ ప్లేట్లు లేని వాహనాల గుర్తింపు

సాలూరు: పట్టణంలో శుక్రవారం ఉదయం సీఐ వాసునాయుడు ఆధ్వర్యంలో వాహన తనిఖీలు నిర్వహించారు. నెంబర్ ప్లేట్లు లేని 20 వాహనాలను పట్టుకున్నారు. నెంబర్ ప్లేట్లు, వాహన పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలని.. లేకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కేవలం గంట కాల వ్యవధిలో నిర్వహించిన తనిఖీల్లో 20 వాహనాలకు నెంబర్ ప్లేట్లు లేవని గుర్తించామని.. ఇలాంటివి ఇంకెన్ని వాహనాలు ఉన్నాయోనని.. వాటిపై ప్రత్యేక నిఘా పెట్టి కేసులు రాస్తామని చెప్పారు. వాహన తనిఖీల్లో ఎస్ఐలు సురేష్, సీతారాం పాల్గొన్నారు.